సాక్షి 24|7

అనంతపురం

గురువారం 31-8-2017

గొంతు తడప గంగా పరవళ్లు

కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి బుధవారం ఉదయం నీటిని విడుదల చేశారు.



6లో▸

ద్యావుడా!


శింగనమల చెరువులో నిమజ్జనానంతర దృశ్యం



ఐదు రోజులు.. వందలాది విగ్రహాలు.. విశేష పూజలు.. దేవుడు మెచ్చిన వంటకాలు.. వేలాది భక్తులు.. సంబరం అంబరాన్నంటింది. చివరి రోజు కోలాహలంతో ఆది దేవుని మది పులకించింది. తల్లి ఒడి చేరుతున్న వేళ ఆ మహాకాయుని మనసు చివుక్కుమంది. భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు స్వామిని చెరువుకు చేర్చడంతో చేతులు దులిపేసుకున్నారు. ఇప్పుడక్కడి దృశ్యాలు చూస్తే బరువెక్కని హృదయం ఉండదు. మట్టి విగ్రహాల ఆవశ్యకతకు ఈ వినాయక విలాపమే సాక్షీభూతం.

16 లో

సైనికుడు



దేశ రక్షణలో ఆత్మకూరు యువత

8,9 లో

టీడీపీలోకి వచ్చి
తప్పు చేశా

ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి




వివరాలు మెయిన్ లో ▸

గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

3 లో

8న ముఖ్యమంత్రి రాక



2 లో



'ప్రాంతాలతో పనిలేదు. జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగు నీరు అందించాలి. పశువులకు నీరు లేక కబేళాలకు తరలుతున్నాయి. నీరు అనేది ప్రాణాధారం. మాకంటే మాకి వ్వండని ఎమ్మెల్యేలు అడగటం కరెక్ట్ కాదు. అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి. సాగుకు వినియోగించే నీటిని అరికట్టాలి. ఎస్పీని కూడా సమావేశానికి పిలిపించాలి. అవసరమైతే ఒక చెరువు నుంచి మరో చెరువుకు కాలువలు నిర్మించి అన్నింటినీ నీటితో నింపాలి."

- వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ



'నీటి వినియోగంపై ప్రభుత్వానికి ప్రణాళిక లేదు. గతేడాది హంద్రీనీవా ద్వారా 26 టీఎంసీలు వచ్చాయి. భవిష్యత్ అవసరాలు పట్టించుకోకుండా ఎవరికి బలం ఉంటే వారు చెరువులకు తీసుకెళ్లారు. నీటి విడుదలలో మంత్రులు, ఎమ్మెల్యేలు మినహా అధికారుల ప్రమేయం ఉండటం లేదు. ఈ ఏడాది టీబీ డ్యాంలోకి నీరు రాక పోయి ఉంటే తాగునీటి పరిస్థితి ఏంటి? ఉరవకొండకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. రాజకీయంగా చూస్తున్నారు. కర్ణాటక అన్యాయంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం స్పందించడంలో వైఫల్యం చెందింది.

- విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఉరవకొండ

తాగునీరే.. సాగుకు లేదు!

ఐఏబీ సమావేశంలో స్పష్టం చేసిన మంత్రులు, అధికారులు

- టీబీ డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వ 64 టీఎంసీలు
- హెచ్చెల్సీ కోటా 9.8 టీఎంసీలు
- అనంత, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల తాగునీటి అవసరాలకు 10టీఎంసీలు
- ఇన్‌ఫ్లో ఆశాజనకంగా ఉండటంతో డ్యాంలో నీటిలభ్యత పెరిగే అవకాశం
- అదే జరిగితే 12 టీఎంసీల వరకూ అందే అవకాశం

- సాక్షి ప్రతినిధి, అనంతపురం

వివరాలు 7లో▸



ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

2017-18 సంవత్సరానికి తాగునీటి కేటాయింపులు (టీఎంసీల్లో)

హెచ్చెల్ఎంసీ	0.409	సీబీఆర్	2.034
గుంతకల్లు బ్రాంచ్ కెనాల్	0.660	మైలవరం బ్రాంచ్ కెనాల్	0.201
పీఏబీఆర్	2.763	నీటి వృథా	3.220
ఎంపీఆర్(దక్షిణ కాలువ)	0.508	మొత్తం	10 టీఎంసీలు

హిందూపురంలో నేడు వినాయక నిమజ్జనం

జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్



అనంతపురం సెంట్రల్: హిందూపురంలో గురువారం నిర్వహిస్తున్న వినాయక నిమజ్జన వేడుకలకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం బందోబస్తు ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను 'సాక్షి'కి వెల్లడించారు. జిల్లాలో హిందూపురంలో ఏడు రోజులకు నిమజ్జన వేడుకలు నిర్వహిస్తారన్నారు. ఈ వేడుకల్లో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో ఐదుగురు డీఎస్పీలు, 19 మంది సీఐలు, 75 మంది ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ బలగాలు మొత్తం 700 మందిని తరలిస్తున్నట్లు వివరించారు. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడైనా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా డయల్ –100, 9989819191 సెల్ నెంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేతల వర్గపోరు

- నగరపాలక సంస్థ అధికారులు సతమతం
- అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ అధికారి
- మేయర్ మందలింపుతో కన్నీరు పెట్టుకున్న వైనం..?



నగరపాలక సంస్థ అతిథి గృహంలో అనధికారికంగా నిర్మిస్తున్న నిర్మాణం

అనంతపురం న్యూసిటీ:

ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది నగరపాలక సంస్థ అధికారులు పరిస్థితి. మేయర్ స్వరూప ఓ ముఖ్య ప్రజాప్రతినిధి మధ్య నెలకొన్న వర్గ పోరు అధికారులకు తలనొప్పి తెచ్చి పెడుతోంది. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి నగరపాలక సంస్థలో వీరిరువురి మధ్య సఖ్యత లేక అధికారులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. గ్రూపు రాజకీయాలతో అధికారులు సతమతమవుతున్నారు. టీపీఎస్ అలివేలమ్మపై మేయర్ స్వరూప మండిపడినట్లు తెలిసింది. దీంతో టీపీఎస్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయం నగరపాలక సంస్థలో పెద్ద చర్చనీయాంశమేనైనా..కొందరు అధికారులు మాత్రం కమిషనర్లపైనే దాడులు చేసిన సందర్భాలున్నాయి. పాలకులకు ఇదేమి లెక్కనానని చెప్పడం గమనార్హం.

అనధికార కట్టడం

నగరపాలక సంస్థ అతిథిగృహంలో ఓ అనధికార కట్టడం జరుగుతోంది. రాంనగర్ ఫ్లెఓవర్ నిర్మాణంలో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు వెడల్పు చేస్తున్నారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు నగరపాలక సంస్థ ముందున్న దుకాణాన్ని తప్పక తొలగించాలి. సదరు నిర్వాహకుడు నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా ఏకంగా అతిథిగృహంలోనే నిర్మాణాన్ని 80 శాతం పూర్తి చేశాడు. దీన్ని ఆలస్యంగా పసిగట్టిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు అనుమతులు లేని నిర్మాణాన్ని తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టీపీఎస్ అలివేలమ్మ చైన్‌మన్‌లతో కలసి అనధికార నిర్మాణాన్ని కూల్చేందుకు అక్కడకు వెళ్లారు. అక్రమ కట్టడాన్ని ఏవిధంగా కడుతారని సంబంధిత నిర్వాహకులను నిలదీశారు.

టీపీఎస్ కన్నీటి పర్యంతం

ఈ విషయం మేయర్ దృష్టికి వెళ్లడంతో ఆమె తీవ్రంగా స్పందించారు. తన డివిజన్ పరిధిలో ఏ విధంగా నిర్మాణాలు కూల్చుతారని టీపీఎస్ అలివేలమ్మపై మేయర్ ఫైర్ అయ్యారు. ఆమె తీవ్రస్థాయిలో మందలించినట్లు సమాచారం. దీంతో ఆమె కన్నీటి పర్యంతమైంది.

దాడులు పరిపాటి

నగరపాలక సంస్థలో అధికారులపై దాడులు పరిపాటిగా మారిపోయారు. కమిషనర్లు చల్లా ఓబులేసు, సురేంద్రబాబు నుంచి వివిధ సెక్షన్లలో పని చేసే ఉద్యోగులపై పాలకవర్గం నేతలు అనుసరిస్తున్న తీరు సర్వత్రా భయాందోళనకు గురి చేస్తోంది. అప్పటి కలెక్టర్ కోనశశిధర్ అధికారులకు అండగా ఉంటామని చెప్పినా పాలకుల్లో ఎటువంటి మార్పు రావడం లేదు. గత నెలలో చెత్త ట్రాక్టర్ల విషయమై బిల్లుల చెల్లింపు జాప్యం జరగడంతో ఎస్‌ఈ సత్యనారాయణపై ఆగ్రహం వ్యక్తం చేయడం వల్ల ఆయన సెలవులో వెళ్లిన విషయం విధితమే.

అక్కడేం జరిగిందో నాకు తెలియదు

టౌన్ ప్లానింగ్ సిబ్బంది నగరపాలక సంస్థ అతిథి గృహంలో చేపడుతున్న నిర్మాణం వద్దకు వెళ్లారని తెలిసింది. అక్కడ ఏం జరిగిందనేది పూర్తిగా విషయం తెలియదు.

– పీవీవీఎస్ మూర్తి (కమిషనర్)

సెప్టెంబర్ 11 నుంచి నిరాహార దీక్షలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 124 జీవో మేరకు నాల్గో తరగతి ఉద్యోగుల నియామకాలు చేపట్టాలని నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకుడు నాగరాజు డిమాండ్ చేశారు. రోగుల సంఖ్య పెరుగుతున్నా పోస్టులు భర్తీ చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్లుగా నియామకాలు చేపట్టలేదని, ఉన్న వారిపై పనిభారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు వినతిపత్రాలు ఇస్తున్నా బుట్టదాఖలవుతున్నాయని, ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 11 నుంచి ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. అంతేకాక నిరసన, నిరాహార దీక్షలకు దిగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓలు రామాంజి, రాజశేఖర్, వెంకటేశులు, లక్ష్మన్న, రమణయ్య పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలి'

అనంతపురం న్యూటౌన్: ఎస్సీ, ఎస్టీ కోర్టు కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాణిబాయిని కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక కోర్టు భవనంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన వాణిబాయిని మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. పబ్లిక్ ప్రసిక్యూటర్‌ను కలిసిన వారిలో బీసీఆర్.దాస్, మాల ఓబిలేసు, సుబ్బారాయుడు, జయరాం నాయక్, బండి రవికుమార్, నాగరాజు, చిరంజీవి తదితరులు ఉన్నారు.

8న ముఖ్యమంత్రి రాక

అనంతపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సెప్టెంబర్ 8న జిల్లాలో పర్యటించనున్నారు. జలహారతిలో భాగంగా ఉరవకొండ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా హంద్రీ–నీవా కాలువ వెడల్పు పనులకు సంబంధించి పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. పూర్తిస్థాయి షెడ్యూల్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ప్రాణం తీసిన కుటుంబ తగాదాలు

వియ్యంకుల దాడిలో వ్యక్తి మృతి

కనగానపల్లి: కూతురు కాపురం నిలబెట్టే క్రమంలో పుట్టింటి వారు ఆవేశానికి లోనై చేసిన చేసిన దాడిలో వియ్యంకుడు ప్రాణం కోల్పోయాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండల కేంద్రం కనగానపల్లికి చెందిన జి.పోతన్న (55) కుమారుడు ప్రతాప్‌కు నాలుగేళ్ల క్రితం ఇటుకపల్లికి చెందిన నరిసింహులు, గంగాదేవి దంపతుల కూతురు వరలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వరలక్ష్మి తన భర్తతో పాటు అత్తమామలతో తరచూ గొడవపడుతూ పుట్టింటికి వెళ్లి కొన్ని రోజుల తర్వాత మళ్లీ తిరిగి వచ్చేది. ఈ నేపథ్యంలో కూతురు కాపురం సజావుగా సాగేలా చూడాలని మంగళవారం సాయంత్రం వరలక్ష్మి తల్లిదండ్రులు తమ సమీప బంధువులతో కలిసి కనగానపల్లికి వచ్చారు. ఈ క్రమంలో పుట్టింటి వారు మెట్టినింటి వారు గొడవపడ్డారు. స్థానికులు సర్దిచెప్పి శాంతింపజేశారు. బుధవారం ఉదయం అల్లుడు ప్రతాప్‌పై వరలక్ష్మి తల్లిదండ్రులు, బంధువులు దాడి చేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన పోతన్నపైనా దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఆయన్ను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. మెడ, ఆయువుపాటుపై బలమైన దెబ్బలు తగలడంతో అప్పటికే పోతన్న మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రతాప్‌కు కూడా దాడిలో గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వరలక్ష్మి తల్లిదండ్రులు నరిసింహులు, గంగాదేవితో పాటు సమీప బంధువులైన గంగాద్రి, లింగమయ్య, హరి, లక్ష్మీదేవిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.



మృతిచెందిన పోతన్న

గుర్తు తెలియని మహిళ హత్య

పెనుకొండ: గుర్తు తెలియని మహిళను హత్య చేసి.. దిండులో చుట్టి పెనుకొండ సమీపంలోని గోనిపేట రహదారిలో పడేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మోరీ వద్ద దుర్వాసన వెదజల్లుతుండడంతో కొందరు వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం చేరవేసారు. సీఐ వెంకటేశులు, ఎస్‌ఐ. జనార్ధన్ సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎరుపు, నలుపు రంగు గళ్ల చీరను ధరించిన మహిళను ఎక్కడో హత్యచేసి ఇక్కడ పడేసినట్లు భావిస్తున్నారు. పది రోజుల కిందట ఈ ఘటన జరిగి ఉండొచ్చని, శవం బాగా కుళ్లిపోయినందున గుర్తు పట్టలేని విధంగా ఉందని అంటున్నారు. హతురాలి వయసు 40 సంవత్సరాలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

యువకుడి ఆత్మహత్య

అనంతపురం న్యూసిటీ: నగరంలోని పీటీసీ సమీపాన రైల్వేట్రాక్ వద్ద బుధవారం ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు... రజకనగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి చాకలి నాగరాజు కుమారుడు హరిప్రసాద్(22) వినాయక నిమజ్జన వేడుకలను తిలకించేందుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి మంగళవారం సాయంత్రం బయటకు వచ్చాడు. రాత్రి పది గంటల అనంతరం మల్లేశ్వరరోడ్డులోని మిత్రుడు ఓబుళపతి రూంకు వెళ్లి హరిప్రసాద్ ఏడ్చుకుంటూ కూర్చుండిపోయాడు. ఎందుకు ఏడుస్తున్నావని అడిగినా ఎటువంటి సమాధానమూ రాలేదు. ఓబుళపతి బాత్రూమ్‌లోకి వెళ్లగానే హరిప్రసాద్ గదిలోంచి బయటకొచ్చేశాడు. కాసేపటి తర్వాత గమనించిన ఓబుళపతి వెంటనే అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. రాత్రంతా కుటుంబ సభ్యులు గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. సెల్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వచ్చింది. బుధవారం ఉదయం పీటీసీ సమీపంలో హరిప్రసాద్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జగదీష్ వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశాడు. హుటాహుటిన వారు ఘటనాస్థలానికి చేరుకుని బోరున విలపించాడు. నిమజ్జనానికి వెళ్లి వస్తానని ఇలా కానరాని లోకాలకు వెళ్లిపోతివా అంటూ హరిప్రసాద్ తండ్రి చాకలి నాగరాజు రోదించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అప్పులబాధతో ఆగిన రైతన్న గుండె



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన రైతు పెద్దన్న (ఫైల్)

కనగానపల్లి: అప్పుల బాధతో ఆందోళనకు గురైన రైతు గుండె పోటుతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం కనగానపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన రైతు హరిజన పెద్దన్న (38)కు ఐదు ఎకరాల మెట్ట పొలం ఉంది. అప్పులు చేసి అందులోనే నాలుగు బోర్లు వేయించాడు. అరకొరగా వస్తున్న నీటితోనే కూరగాయలు సాగు చేశాడు. అయితే ఆ నీరు చాలకపోవడం, వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు చేతికి రాలేదు. బోర్లు, పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు రూ.4 లక్షలకు చేరుకున్నాయి. ఓ వైపు అప్పులు, మరోవైపు కుటుంబ పోషణ భారం కావడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మార్గం మధ్యలో మృతి చెందాడు. రైతుకు భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య



మృతురాలు గొల్ల జయలక్ష్మి

గుమ్మఘట్ట: భర్త మందలించాడని మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకుంది. ఎర్రంపల్లికి చెందిన జయలక్ష్మి (28) మంగళవారం వేరుశనగ పొలంలో కలుపు తొలగించి ఇంటికి వచ్చింది. కాళ్లు శుభ్రంగా కడుక్కోకుండా ఇంట్లోకి అలాగే వచ్చావని భర్త చంద్ర ఆరు బయట మందలించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య కాసేపు ఘర్షణ జరిగింది. రోజంతా పనిచేసినా భర్త చేతిలో చివాట్లు తినాల్సి రావడంతో మనస్తాపానికి గురైన జయలక్ష్మి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. రాయదుర్గం సీఐ చలపతి, గుమ్మఘట్ట ఎస్‌ఐ హైదర్‌వలిలు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి,దండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

భారీగా ఉప్పు ప్యాకెట్ల సీజ్

అనంతపురం సెంట్రల్: నిబంధనలకు తిలోదకాలిచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న ఉప్పు ప్యాకెట్లను తూనికలు, కొలతల శాఖ సీఐ శంకర్ సీజ్ చేశారు. బుధవారం హిందూపురంలోని పరిగిరోడ్డులో గల ప్రముఖ దుకాణంలో తనిఖీలు చేయగా పెద్ద ఎత్తున ఉప్పు నిల్వలు బయటపడ్డాయి. వీటిపై తయారీదారు చిరునామా, ఎంఆర్‌పీ, టోల్ ఫ్రీ ఇతర వివరాలేవీ లేవని గుర్తించారు. మొత్తం 1350 ప్యాకెట్లు సీజ్ చేసి ప్రత్యేక వాహనం ద్వారా అనంతపురం తీసుకొచ్చారు. ఇంటికి సంబంధించి తులుపులు (డోర్) 10 సీజ్ చేశారు. నిబంధనలు పాటించకుండా అధికధరలకు విక్రయిస్తుండడంటో వీటిపై చర్యలు తీసుకున్నట్లు సీఐ శంకర్ వివరించారు.

హత్యకేసు నిందితుడికి రిమాండ్

కదిరి అర్బన్: ఎన్జీఓ కాలనీకి చెందిన మల్లీశ్వరి (40) హత్య కేసులో నిందితుడైన గాజుల అశోక్‌ను కోర్టు రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం కదిరి రూరల్ సీఐ కార్యాలయంలో ఆయన మీడియాకు వెల్లడించారు. వివాహితులైన మల్లీశ్వరి, అశోక్‌ల మధ్య కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. మల్లీశ్వరి తన కుటుంబాన్ని వదిలేసి ప్రియుడు అశోక్ చెంతకు చేరి విశాఖలోని గాజువాకలో అద్దె ఇంట్లో కొన్నాళ్లు సహజీవనం సాగించింది. అనంతరం భర్త, పిల్లలు గుర్తుకు రావడంతో తిరిగి ఆమె కదిరికి వచ్చేసింది. అశోక్ కూడా తిరిగి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి మకాం మార్చి.. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. అయినప్పటికీ ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణలు కొనసాగేవి. ఈ క్రమంలో మంగళవారం అశోక్ తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చేరుకుని.. మల్లీశ్వరిని కూడా అక్కడికి రప్పించుకున్నాడు. అనంతరం ఇద్దరూ నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి వాగ్వాదం చేసుకున్నారు. ఆగ్రహానికి గురైన అశోక్ కారులో సిద్ధంగా ఉంచుకున్న కత్తితో మల్లీశ్వరిని హత్య చేసి తనకల్లు పోలీస్టేషన్‌లో లొంగిపోయాడు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ శ్రీధర్, తనకల్లు ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

వివాహితను వేధించినందుకు నాలుగేళ్ల జైలు

గుంతకల్లు: ప్రేమ పేరుతో వివాహితను వేధించిన కేసులో ముద్దాయికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ గుంతకల్లు జేఎఫ్‌సీఎం వాసుదేవరావు తీర్పునిచ్చారు. టూటౌన్ ఎస్‌ఐ వలిబాషు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లులోని హౌసింగ్‌బోర్డులో నివాసముంటున్న యు.సునీల్‌కుమార్ ఇదే కాలనీలో నివాసముంటున్న వివాహితను ప్రేమించాలంటూ వేధిస్తుండేవాడు. 2016 ఫిబవరిలో ఆమె ఇంట్లోకి వెళ్లి వేధింపులకు పాల్పడగా వారించబోయిన ఆమె తండ్రిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడాదికిపైగా సాగిన ఈ కేసు విచారణ బుధవారం పూర్తయింది. నేరం రుజువు కావడంతో ముద్దాయి సునీల్‌కుమార్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ గుంతకల్లు జేఎఫ్‌సీఎం వాసుదేవరావు తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 5 నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసును ఏపీపీ సుభాషిణి వాదించారు.

WIN-WIN IAS ACADEMY

గ్రూప్స్ పరీక్షలపై

సాక్షి యువ మైత్రి

ఉచిత అవగాహన సదస్సు

- 'సాక్షి' యువ మైత్రి, విన్ విన్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో..
- సెప్టెంబర్ 3న అనంతపురంలో ఏర్పాటు
- సమయం: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు

సాక్షి, హైదరాబాద్: 'గ్రూప్స్' పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం 'సాక్షి' యువ మైత్రి, విన్ విన్ ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 3న అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న లలిత కళా పరిషత్‌లో ఈ సదస్సు జరగనుంది. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సదస్సు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రూప్ 1, గ్రూప్ 2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో కొత్తగా వస్తున్న మార్పులు, సమకాలీన దృక్పథాలు, అవలంబించాల్సిన తీరు, ఆన్సర్ రైటింగ్ టెక్నిక్స్, జనరల్ ఎస్సే టెక్నిక్స్, గ్రూప్ 2 ఉద్యోగాలు గ్రూప్ 1లోకి విలీనం తదితర అంశాలపై విన్‌విన్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్లు, 'సాక్షి' కాలమిస్టులు సి.హరికృష్ణ, కె.యాకూబ్ బాషా, అల్లాడి అంజయ్య అవగాహన కల్గిస్తారు. ఈ సదస్సులో నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు గ్రూప్స్ ఉద్యోగాల శిక్షణ ఫీజులో 30 శాతం రాయితీని విన్ విన్ ఐఏఎస్ అకాడమీ అందిస్తుంది. మరిన్ని వివరాలకు 9849871425, 8367763740, 9666421880 నంబర్లలో సంప్రదించవచ్చు.

భవిష్యం

మేషం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

వృషభం: శ్రమాధిక్యం. పనుల్లో తొందరపాటు. ప్రయాణాలలో అవాంతరాలు. వ్యయ ప్రయాసలు. బంధువులతో తగాదాలు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.



మిథునం: చిరకాల స్వప్నం నెరవేరుతుంది. విద్యావకాశాలు. ప్రముఖులతో పరిచయాలు. పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

కర్కాటకం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక ప్రగతి. పరిచయాలు పెరుగుతాయి. శుభవార్తలు. వాహనయోగం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు.

సింహం: పనుల్లో అవాంతరాలు. వృథా ఖర్చులు. బంధువులతో మాటపట్టింపులు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితి.

కన్య: కొన్ని సమస్యలు వేధిస్తాయి. ఆరోగ్యభంగం. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూరప్రయాణాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

తుల: పరిచయాలు పెరుగుతాయి. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. ఉద్యోగావకాశాలు. వృత్తి, వ్యాపారాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

వృశ్చికం: కుటుంబ, ఆరోగ్యసమస్యలు. వ్యయప్రయాసలు. ఆదాయానికి మించిన ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహం.

ధనుస్సు: చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. కార్యజయం. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతులు.

మకరం: శ్రమ పెరుగుతుంది. ఆకస్మిక ప్రయాణాలు. ఇంటాబయటా ఒత్తిడులు. దైవ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో నిరాశ.

కుంభం: పలుకుబడి పెరుగుతుంది. శుభవార్తలు. వాహనయోగం. చర్చలు ఫలిస్తాయి. వస్తులాభాలు. వ్యాపారాలలో పురోగతి. ఉద్యోగులకు విధుల్లో చికాకులు తొలగుతాయి.

మీనం: పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల సాయం అందుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

– సింహంభట్ల సుబ్బారావు



హిందూపురంలో నిర్వహించిన 'నవరత్నాల సభ'లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త నవీన్‌నిశ్చల్



నల్లమాడ మండలం నల్లశింగయ్యగారిపల్లిలోని తన నివాసంలో జరిగిన నవరత్నాల సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు



సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

- నంద్యాలలో టీడీపీది అప్రజాస్వామిక గెలుపు
- జగనన్న వస్తున్నాడని ప్రతి ఒక్కరికీ చెప్పండి
- నవరత్నాల సభలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు

ఉరవకొండ: తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలపై బూత్‌లెవల్ కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఉరవకొండలోని శ్రీ వీరశైవ కల్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యాన 'నవరత్నాల' సభ నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బూత్ లెవెల్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు భారీగా తరలివచ్చారు. వజ్రకరూర్ మండల కన్వీనర్ జయేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. అధికారంలోకి రావడానికి గత ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చారని, ఇందులో ఒక్కటీ నేరవేర్చలేక పోయారని మండిపడ్డారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. హంద్రీ– నీవా ఆయకట్టు ద్వారా ఉరవకొండ నియోజకవర్గంలోని లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉందన్నారు. అయితే చంద్రబాబు అధికారం చేపట్టి మూడేళ్లు పూర్తయినా ఒక్క ఎకరాకు కుడా సాగునీరు ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో పేదలకు ఇంటి పట్టాల కోసం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని ధ్వజమెత్తారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలపై కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తు కోట్లాది రూపాయలు గుమ్మరించి టీడీపీ అక్కడ గెలిచిందన్నారు. ఓటర్లను బెదిరించి, ప్రలోభ పెట్టి గెలవడం గొప్ప విషయం కాదన్నారు. చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కోట్లాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన 20 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి.. ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. టీడీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాజన్న రాజ్యం కోసం వైఎస్సార్‌సీపీ ప్లీనరీ వేదికగా ప్రకటించిన నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని, జగనన్న వస్తున్నాడని ఊరూవాడా చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు యువనేత వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అశోక్, తేజోనాథ్, మాన్యం ప్రకాష్, కాకర్ల నాగేశ్వరావు, బసవరాజు, జెడ్పీటీసీ సభ్యులు తిప్పయ్య, లలితమ్మ, నిర్మలమ్మ, ఎంపీపీ కొర్రా వెంకటమ్మ, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బోయ సుశీలమ్మ, చేనేత విభాగం జిల్లా కమిటీ సభ్యులు ఎంసీ నాగభూషణం, చెంగల మహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

పయ్యావుల సోదరుల అండతో జూదకేంద్రం

కూడేరు మండలం కొర్రకోడు డ్యాం వద్ద ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు శీనప్పల అండదండలతో జూద కేంద్రం నడుస్తోందని ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విరుచుకుపడ్డారు. జూదకేంద్రం వద్దే మద్యం కూడా అందుబాటులో ఉంచారని, ఇక్కడ ఒక ఎస్ఐ కూడా కాపలా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూద కేంద్రం ద్వారా వచ్చే ఆదాయంలో పయ్యావుల సోదరులకు మామూళ్లు ముట్టజెబుతున్నారని ఆరోపించారు. గతంలో తాడిపత్రికి చెందిన ఒక వ్యక్తి జూదంలో రూ.లక్షలు పోగొట్టుకుని ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ సభ్యులను హతమార్చి, చివరకు తనూ ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తు చేశారు. నియోజకవర్గంలో పయ్యావుల సోదరులు జూదం, మద్యం మాఫియాను పెంచిపోషిస్తున్నారని తెలిపారు.

తిరుమల సమాచారం



తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:


ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం – 150 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం – 200 ఖాళీ ఉన్నాయి

గురువారం ప్రత్యేక సేవ : తిరుప్పావడ

కసాపురం ఆలయ సమాచారం



గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామివారికి గురువారం నిర్వహించే పూజల వివరాలు.

- వేకువజామున 4.15 గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం.
- 5.30 గంటలకు అలంకరణ నిజరూప దర్శనం.
- ఉదయం 6.30 గంటలకుప్రత్యేక పుష్పాలంకరణ, నిత్య పూజలతో భక్తులకు దర్శనం.
- ఉదయం 11.30 గంటలకు మహా నివేదన.
- మధ్యాహ్నం 12.30 గంటలకు మహామంగళహారతి. అనంతరం ఆలయం మూసివేత.
- మధ్యాహ్నం 2 గంటలనుండి యదావిధిగా పూజల కొనసాగింపు.
- రాత్రి 8.30 గంటలకు మహామంగళ హారతితో ఆలయం మూసివేత.

వాతావరణం

రానున్న 24 గంటల్లో సౌరాష్ట్ర, కచ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర పశ్చిమ బెంగాల్, పశ్చిమ తీర ప్రాంతాల్లో మధ్యస్థం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మిగిలిన ప్రాంతాల్లో, జార్ఖండ్, బిహార్, ఉత్తర ప్రదేశ్ పర్వతాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో, ఉత్తర ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, పంజాబ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయి.

అనంతపురం వాతావరణం

గరిష్టం కనిష్టం

35.0°/25.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.5	27.6
కోల్‌కతా	35.2	26.0
బెంగళూరు	28.5	31.1
ముంబై	30.5	23.1
చెన్నై	36.1	25.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	36.8/27.0	కాకినాడ	33.8/24.0
ఒంగోలు	36.6/26.0	ఖమ్మం	33.0/20.0
చిత్తూరు	36.5/26.0	విశాఖపట్నం	32.7/24.6
తిరుపతి	36.5/26.0	శ్రీకాకుళం	32.6/26.5
అనంతపురం	35.0/25.0	విజయనగరం	32.6/26.5
విజయవాడ	35.0/24.6	నల్లగొండ	32.6/24.0
కడప	34.8/26.0	ఆదిలాబాద్	32.6/21.0
గుంటూరు	34.8/24.0	హైదరాబాద్	32.0/22.3
కర్నూలు	34.6/25.0	రంగారెడ్డి	32.0/22.3
కరీంనగర్	34.2/25.2	నిజామాబాద్	31.9/24.0
ఏలూరు	34.0/25.6	మెదక్	31.7/21.6
రాజమండ్రి	34.0/25.6	వరంగల్	31.6/24.5
తాడేపల్లిగూడెం	34.0/25.6	మహబూబ్‌నగర్	31.4/23.0

బుల్లితెర

www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 స్క్రీన్‌ప్లే
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 గూఢచారి 117
ఉ.09.30 శేషాద్రి నాయుడు
మ.12.00 పోస్ట్‌మ్యాన్
మ.03.00 శ్రీమతీ వెళ్లొస్తా
సా.06.00 అంధ్రుడు




హెచ్‌బీవో
ఉ.08.09 ఘోస్ట్ షిప్
ఉ.09.42 ఫూల్స్ గుడ్
ఉ.11.38 కుంగ్‌ఫు పాండా 2
సా.05.10 ఐపీ మ్యాన్ 3
రా.07.00 ద అకౌంటెంట్



మా మూవీస్
ఉ.07.00 పెద్దోడు చిన్నోడు
ఉ.09.00 ఆనంద్
మ.12.00 షాక్
మ.03.00 ఎందుకంటే ప్రేమంట
సా.05.00 సింగం



మూవీస్ నౌ
ఉ.08.20 స్పిసిస్
ఉ.10.20 క్లిఫ్ హ్యాంగర్
మ.02.45 రష్ అవర్ 3
సా.05.55 సూపర్‌మాన్ రిటర్న్స్
రా.09.00 టాయ్ స్టోరీ



సోనీ పిక్స్
ఉ.0626 సెంటర్ స్టేజ్
ఉ.11.26 బ్యాటిల్‌షిప్
మ.01.47 ద ఇంక్రెడిబుల్ హల్క్
సా.06.13 వాటర్‌వరల్డ్
రా.09.00 జురాసిక్ పార్క్



జీ సినిమా
ఉ.07.50 ఆవారా పాగల్ దీవానా
ఉ.10.54 ఐ
మ.02.42 సిర్ఫ్ తుమ్
సా.05.41 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 నామ్ షబానా

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు :
అనంతపురం న్యూసిటీ- బాలకృష్ణారావు : 9885656873
అనంతపురం అర్బన్- విజయభాస్కర్ : 9010312451
అనంతపురం సిటీ - మంజునాథ్ : 9441888612
అనంతపురం సెంట్రల్- రమణారెడ్డి : 8885845631
అనంతపురం టౌన్- మున్వర్‌బాషా : 9010311197
అనంతపురం ఎడ్యుకేషన్- నగేష్ : 9010756716
అనంతపురం అగ్రికల్చర్- రామలింగారెడ్డి : 9010310799
అనంతపురం కల్చరల్- మురళీకృష్ణ : 9010748990



జాతీయస్థాయిలో సత్తాచాటాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్:

జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర సత్తా చాటాలని వన్‌టౌన్ సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర టెన్నికాయిట్ జట్టుకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన, డీ ఎస్‌డీఓ బాషామోహిద్దీన్, రాష్ట్ర టెన్ని కాయిట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ముస్తఫా అలీఖాన్, జిల్లా అధ్యక్షుడు రజాక్‌లు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులకు బ్లూమూ న్ ఎడ్యూకేషనల్ సొసైటీ చైర్మెన్ శివశంకర్ క్రీడా దుస్తులను అందించారు. ఎంపికైన జట్టు సెప్టెంబర్ 3 నుంచి 7 వరకు కేరళలోని త్రిశూర్‌లో జరిగే జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రంగస్వామి కోచ్‌లు అశోక్, హరీష్ పాల్గొన్నారు.



ఎంపికైన రాష్ట్ర టెన్నికాయిట్ జట్టు

ఎంపికైన బాలుర జట్టు

యశ్వంత్‌కుమార్, సందీప్‌కుమార్(విజయనగరం), రవికుమార్, అజ్మతుల్లా(కృష్ణా), నివాస్‌పాత్రో(శ్రీకాకుళం), త్రిమూర్తులు(పశ్చిమ గోదావరి)

బాలికల జట్టు

సుమతి(చిత్తూరు), మౌనిక, శ్రావణి (విజయనగరం), గంగోత్రి(అనంతపురం), సునందు(కృష్ణా), నాగలక్ష్మీ (విశాఖపట్టణం).

కుమార్‌గౌడ్‌కు నివాళి

అనంతపురం అర్బన్: కర్నూలు జిల్లాకు చెందిన లోలెవ్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్ మరణం తీరని లోటని నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ నెల 20న రోడ్డు ప్రమాదంలో కుమార్‌గౌడ్ మరణించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో కుమార్ గౌడ్ చిత్రపటానికి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సమాచార శాఖమంత్రి కాలవ శ్రీనివాసులు, ఎంపీ జె.సి.దివాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు నవరత్నాల సభ

అనంతపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ 'నవరత్నాల సభ' గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక సంగమేశ్వర ఫంక్షన్ హాలు(పాత సంగమేష్ థియేటర్)లో ఏర్పాటు చేస్తున్నట్లు మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నదీంఅహ్మద్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత ప్రకటించిన నవరత్నల్లాంటి పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతుందన్నారు. ఈ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న సభకు పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ల కన్వీనర్లు, బూత్ కమిటీల కన్వీనర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వంతెనల నిర్మాణానికి భూమి పూజ

అనంతపురం న్యూసిటీ: నడిమివంకపై నాలుగు వంతెల నిర్మాణానికి ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి బుధవారం భూమి పూజ చేశారు. వంతెన ఏర్పాటైతే 40, 41, 42, 46 డివిజన్ల పరిధిలోని రజక్‌నగర్, రంగస్వామినగర్, సోమనాథ్ నగర్ ప్రజలకు రాకపోకలకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, కార్పొరేటర్లు సరళ, విజయశ్రీ, ఆదినారాయణ, బంగారక్క పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అనంతపురం న్యూటౌన్: బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బుధవారం యువజన సంక్షేమశాఖాధికారి వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 040–29709296 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి

అనంతపురం అర్బన్: ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై మహిళలు చైతన్యవంతులై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి నేతృత్వంలో జరిగిన తరగతులకు రాంభూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిని త్వరలోనే నియమిస్తాం

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిని త్వరలోనే నియమిస్తామని డీఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఏడీఎస్ఎస్ఏ కార్యదర్శిని బుధవారం నియమించామని, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కోసం జిల్లాలోని సీనియర్ పీడీల నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. వారిలో అర్హులను త్వరలోనే నియమిస్తామని ఆయన పేర్కొన్నారు.

'హంద్రీ-నీవా' వైఎస్సార్ పుణ్యమే

- రాప్తాడు సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- 3.55 లక్షల ఆయకట్టును బీళ్లుగా మార్చిన ఘనత చంద్రబాబుదే
- సీఎం వైఖరితో జిల్లాలో వ్యవసాయం ఛిన్నాభిన్నం
- సాగునీటి సాధనను ప్రతి రైతూ హక్కుగా భావించాలి
- విపక్షాలను కలుపుకుని త్వరలో రైతు చైతన్యయాత్ర



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

బుక్కపట్నం(పుట్టపర్తి):

హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను జిల్లాకు తీసుకువచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదేనని రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. తాగు, సాగునీటి సాధనపై బుధవారం పుట్టపర్తిలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కరువు కాటకాలకు నిలయమైన రాయలసీమ జిల్లాలకు తాగు, సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో 2006-07లోనే హంద్రీ-నీవా పథకానికి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జీవం పోశారన్నారు. అనుకున్నదే తడవుగా రెండేళ్లలోనే దాదాపు 70 శాతానికి పైగా పనులు పూర్తిత చేశారని గుర్తుచేశారు. వైఎస్ చలవతోనే నేడు జీడిపల్లి, గొల్లపల్లి రిజర్వాయర్లకు కృష్ణా జలాలు వచ్చాయన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో సీఎం చంద్రబాబుకు, జిల్లా మంత్రులకు, ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లేకుండాపోయిందన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ వారే హిందూపురంలో ఎమ్మెల్యేలుగా ఉన్నా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు.

ఆయకట్టును బీళ్లుగా మార్చిన చంద్రబాబు

మహోన్నత ఆశయంతో వైఎస్సార్ తలపెట్టిన హంద్రీ-నీవా ప్రాజెక్ట్ లక్ష్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వార్థం కోసం నిర్వీర్యం చేశారని విమర్శించారు. హంద్రీ-నీవా ద్వారా జిల్లాలోని 3.55 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనేది వైఎస్సార్ లక్ష్యమని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన బుక్కపట్నం చెరువుకు హంద్రీనీవా నీటి కేటాయింపులు ఇస్తూ జీఓ చేసింది కూడా వైఎస్సారేనని అన్నారు. అయితే అధికారం చేపట్టగానే హంద్రీ-నీవా ఆయకట్టును రద్దు చేస్తూ.. 3.55 లక్షల ఎకరాలను బీళ్లుగా మార్చిన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. ఇందులో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 2.50 లక్షల ఎకరాలు బీళ్లుగా మారాయని తెలిపారు. సాగునీరు అందక పొరుగు రాష్ట్రాలకు రైతులు వలస వెళ్లాల్సిన దౌర్భగ్య స్థితిని కల్పించారంటూ అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు వైఖరి వల్ల జిల్లాలో వ్యవసాయం ఛిన్నాభిన్నమైందన్నారు. ఈ విషయంపై జిల్లా రైతుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు విపక్షాలను కలుపుకుని త్వరలో పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. సాగునీటి సాధనను హక్కుగా పొందేలా హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రైతులు సంఘటితమై తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతు సంక్షేమం కోసం సీపీఐ చేపట్టే ఉద్యమాలకు పూర్తి మద్దతునిస్తున్నట్లు తెలిపారు.

8 నుంచి రిలేదీక్షలు

తాగు, సాగునీటి సాధన కోసం సెప్టెంబర్ 8వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రిలేదీక్షలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్ తెలిపారు. హంద్రీ-నీవా ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు వైఎస్ రాజశేఖరరెడ్డి పడిన తపనను కొనియాడారు. ఉద్యమాలతోనే తాగు, సాగునీటి పథకాలు పూర్తి అవుతాయని, ఈ విషయంలో రైతులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రకాష్‌రెడ్డి తలపెట్టిన పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి నీటి విడుదల


డ్యాం నుంచి నీరు వదిలిన దృశ్యం

బొమ్మనహాళ్/హోస్పేట: జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ కాలువకు బుధవారం తుంగభద్ర మండలి అధికారులు నీటిని వదిలారు. హెచ్చెల్సీ కాలువకు సంబంధించిన రెండు గేట్లకు తుంగభద్ర మండలి కార్యదర్శి డి.రంగారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.లక్ష్మప్ప, అసిస్టెంట్ కార్యదర్శి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గేట్లకు సంబంధించిన స్విచ్ ఆన్ చేసి కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రారంభంలో వంద క్యూసెక్కుల వరకు నీటిని వదిలారు. గంట గంటకు వంద క్యూసెక్కుల వరకు నీటి సామర్థ్యాన్ని పెంచుతూ మొత్తం 500 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయనున్నట్లు ఈ సందర్భంగా మండలి అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తుంగభద్ర మండలి ఇంజినీర్ శ్రీనివాస నాయక్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులివ్వండి : ఆపస్

అనంతపురం ఎడ్యుకేషన్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని అందజేస్తున్న ఉ త్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక ప్రక్రి య లోపభూయిష్టంగా ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పే ర్కొంది. అవార్డుల కోసం ఉపాధ్యాయులే స్వయంగా దరఖాస్తులు అందజేసే విధా నం సరికాదంటూ ఆ సంఘం జిల్లా ప్రధా న కార్యదర్శి తరిగోపుల నారాయణస్వామి పే ర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆ యన ఓ ప్రకటన విడుదల చేశారు. మంచి క్రమశిక్షణ, ఉత్తమ బోధన, సమాజహితం కోసం పాటుపడే ఉపాధ్యాయులను ప్రభుత్వమే గుర్తించి, అవార్డులు ప్రదానం చేయ డం ద్వారా వాటిని అందుకున్న వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.

3న బోధనేతర సిబ్బంది కార్యవర్గం ఎన్నిక

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక సెప్టెంబర్ 3న ఉంటుందని సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులు నరసింహులు, గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నిక ప్రక్రియను స్థానిక కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల బోధనేతర సిబ్బంది హాజరుకావాలని పిలుపునిచ్చారు.

'బీఏఎస్' విద్యార్థులకు కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకం కింద 2017-18 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలల్లో చేరేందుకు అర్హత సాధించిన విద్యార్థులకు సెప్టెంబర్ 1, 4, 6 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందని గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి కొండలరావు తెలిపారు. 481 సీట్ల భర్తీకి లాటరీ విధానం ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. 3వ తరగతి సుగాలీ విద్యార్థులకు 1న, ఎరికల విద్యార్థులకు 4న అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 5వ తరగతి సుగాలీ, ఎరికల విద్యార్థులకు 5న, అలాగే 8వ తరగతి సుగాలీ, ఎరికల విద్యార్థులకు 6న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 08554-220543కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

బోధనేతర ఉద్యోగుల సంఘం ఎన్నికలకు ముమ్మర ప్రచారం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలకృష్ణారెడ్డి, తదితరులు

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బోధనేతర ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక నేపథ్యంలో ఇరువర్గాలు ముమ్మర ప్రచారం నిర్వహించాయి. సెప్టెంబర్ 1న బోధనేతర ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష స్థానానికి జి.వెంకట్రాముడు, జి.రామకృష్ణ, కార్యదర్శి స్థానానికి నాగప్రసాద్, ఎన్.కేశవరెడ్డి, ఉపాధ్యక్ష స్థానానికి రామమోహనరెడ్డి, నాగయ్య పోటీ చేస్తున్నారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ మద్దతుదారుల మధ్య పోటీ నెలకొనడంతో సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బోధనేతర ఉద్యోగ సంఘం మాజీ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆర్థిక, ఇతర ఇబ్బందుల కారణంగా డ్రాపౌట్స్‌గా మారుతున్న అనాథ, పేద విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జిల్లా విద్యాశాఖాధికారులను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదిత్యదాస్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సర్వశిక్ష అభియాన్, విద్యాశాఖ అధికారులతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఎస్ఏ ఎస్పీడీ శ్రీనివాస్‌తో కలిసి వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎలాంటి సమస్య ఉన్న ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయి అధికారుల తనిఖీలు ఉంటాయని, ఆ సమయంలో ఏవైనా సమస్యలు గుర్తిస్తే అందుకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలోని కేజీబీవీల్లో తాగునీటి సమస్య జఠిలంగా మారిందని, ట్యాంకర్లతో సరఫరా చేయిస్తున్నట్లు ఈ సందర్భంగా వారి దృష్టికి ప్రాజెక్ట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం తీసుకెళ్లారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ పగడాల లక్ష్మీనారాయణ, ఈఈ విజయశేఖర్, ఎఫ్ఏఓ, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, డీఈలు, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

- యువతకు యువజన సంక్షేమశాఖాధికారి వెంకటేశం పిలుపు

అనంతపురం కల్చరల్: సేవా భావం అలవర్చుకున్నప్పుడే జీవితంలో రాణిస్తారంటూ యువతకు యువజన సంక్షేమ శాఖాధికారి వెంకటేశం సూచించారు. 'విపత్తు నిర్వహణ-ప్రథమ చికిత్స' అనే అంశంపై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, విపత్తు స్పందన సర్వీసు శాఖ సౌజన్యంతో స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశం మాట్లాడారు. చుట్టుపక్కల ప్రాంతాలలో ఎక్కడ విపత్తులు సంభవిస్తే వెంటనే ఆదుకోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వలంటీర్లగా సేవచేయడానికి ముందుకు వచ్చిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగస్వామి, జిల్లా



మాట్లాడుతున్న వెంకటేశం

అగ్నిమాపకశాఖాధికారి సత్యనారాయణ, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రామకృష్ణ, రీజనల్ కో ఆర్డినేటర్ శంకరరెడ్డి, సెక్రటరీ రియాజుద్దీన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీరాములు, మానవతా అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

తాగునీరే.. సాగుకు లేదు !



రెవెన్యూ భవనంలో నిర్వహించిన ఐఏబీ సమావేశానికి హాజరైన నేతలు

సాక్షిప్రతినిధి, అనంతపురం:

'తుంగభద్రడ్యాంలో ప్రస్తుతం 64 టీఎంసీల నీరు ఉంది. ఏపీకి దామాషా ప్రకారం 9.8 టీఎంసీలు కేటాయించారు. ఆ నీటిని పూర్తిగా తాగునీటికే వినియోగిస్తాం. ప్రస్తుతం డ్యాంలో ఇన్‌ఫ్లో ఆశాజనకంగా ఉంది. మంచి వర్షాలు కురిసి, డ్యాంలో నీటి లభ్యత పెరిగితే సాగునీటి గురించి తర్వాత ఆలోచిస్తాం' అని జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో బుధవారం ఐఏబీ (నీటిపారుదల సలహా మండలి) సమావేశం నిర్వహించారు. మంత్రులు దేవినేని, కాలవ శ్రీనివాసులుతో పాటు అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీరు : ఎస్‌ఈ

టీబీడ్యాంలో నీటిలభ్యత, హెచ్చెల్సీ కోటా, తాగు, సాగునీటి అవసరాలు, ప్రాధాన్యతలను హెచ్చెల్సీ ఎస్‌ఈ శేషగిరిరావు వివరించారు. ఏటా తుంగభద్ర నుంచి వచ్చే నీటిని ఎగువ ప్రాంతంలోని ఆయకట్టుకు ఇస్తూ దిగువన ఉన్న పీఏబీఆర్, ఎంపీఆర్, సీబీఆర్‌లకు కూడా ఇచ్చేవాళ్లమని గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది డ్యాంలో నీటిలభ్యత తక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం డ్యాంలో 64 టీఎంసీలు ఉన్నాయని, ఇందులో హెచ్చెల్సీ వాటాను 9.8 టీఎంసీలుగా టీబీ బోర్డు నిర్ణయించిందన్నారు. అయితే హెచ్చెల్సీ పరిధిలో తాగునీటి అవసరాలకే 10 టీఎంసీల నీరు అవసరమన్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన సమీక్షలో హెచ్చెల్సీకి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీరిస్తామని టీబీబోర్డు స్పష్టం చేసిందన్నారు. 20 రోజులు ఆన్, 10 రోజులు ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేస్తామన్నారని వివరించారు. టీబీడ్యాం నుంచి ఎంపీఆర్‌కు నీరు చేరాలంటే కనీసం 30 రోజులు పడుతుందన్నారు. 20 రోజులు విడుదల చేసి పదిరోజులు నీటి విడుదల ఆగిపోతే నీరు చేరదన్నారు. అందుకే మొదటి 30 రోజులు నీటిని విడుదల చేసి, ఆపై 10 రోజులు కావాలంటే 'ఆఫ్ పద్ధతి'లో కర్ణాటకకు వినియోగించుకోవాలని తెలిపామన్నారు. ఇలా కాకుండా దామాషా ప్రకారం నిరాటకంగా నీరు విడుదల చేస్తే 1100 క్యూసెక్కులు ఇచ్చినా సరిపోతుందన్నారు. ఈ నీటిని 85 రోజుల వరకూ తీసుకోవచ్చన్నారు. టీబీడ్యాంలో నీటినిల్వ సామర్థ్యం 16 టీఎంసీలకు తగ్గితే హెచ్చెల్సీ ద్వారా చుక్కనీరు కూడా తీసుకునే అవకాశం ఉండదని, అందుకే నీటి సామర్థ్యం 16 టీఎంసీలకు చేరకముందే కోటా మేర నీటిని తీసుకోవాలన్నారు. తర్వాత ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంత అవసరాలను ప్రస్తావించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమస్యలు, సూచనల తర్వాత కలెక్టర్ వీరపాండియన్ మాట్లాడారు.

12 టీఎంసీలు తీసుకునే అవకాశం : కలెక్టర్

డ్యాంలో ప్రస్తుతం 64 టీఎంసీలు ఉన్నాయని, ప్రస్తుతం 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని కలెక్టర్ వీరపాండియన్ తెలిపారు. డ్యాంలో 75–80 టీఎంసీల నీటి లభ్యత ఉండే అవకాశం ఉందన్నారు. కాబట్టి 11.5 నుంచి 12 టీఎంసీలు హెచ్చెల్సీ ద్వారా తీసుకునే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ప్రతినీటి చుక్కను తాగునీటి అవసరాలకే వినియోగిస్తామన్నారు. భవిష్యత్తులో మంచి వర్షాలు కురిసి, డ్యాంలో నీటి లభ్యత పెరిగితే సాగునీరు, రక్షకతడుల గురించి ఆలోచిస్తామన్నారు. హంద్రీ–నీవా ద్వారా నీరు వచ్చే అవకాశం ఉందని, అన్ని ప్రాంతాల అవసరాలను పరిగణలోకి తీసుకుంటామని ప్రజాప్రతినిధులు సహకరించాలని విన్నవించారు.

నీటి లభ్యత బాగా తగ్గింది : మంత్రి కాలవ

మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ టీబీ డ్యాం చరిత్రలో ఎన్నడూలేని విధంగా నీటిలభ్యత తగ్గిపోయిందన్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లోకాస్త మాత్రం ఆశాజనకంగా ఉందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తాగునీటికే ప్రాధాన్యత ఇస్తామని, ఆ దిశగానే అధికారులు ప్రణాళికలు రూపొందించారన్నారు. శ్రీశైలం నుంచి కూడా నీరు వచ్చే అవకాశం ఉందని, దీన్ని కూడా తాగునీటి అవసరాలకు వినియోగించాలన్నారు.

కణేకల్ చెరువుకు మొదట నీళ్లిస్తాం : మంత్రి దేవినేని

అందరి అభిప్రాయాలు ఆలకించిన తర్వాత చివరగా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు సూచించిన మేరకు ఆయా ప్రాంత అవసరాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఆయకట్టు రైతులు కూడా కలిసి సమస్యలను విన్నవించారన్నారు. అయితే డ్యాంలో నీరు తక్కువగా ఉండటంతో ఆన్‌అండ్ ఆఫ్ పద్ధతిన తీసుకుంటున్నామన్నారు. టీబీడ్యాం నుంచి మొదట కణేకల్ చెరువును నింపుతామన్నారు. తర్వాత పీఏబీఆర్, ఎంపీఆర్, సీబీఆర్ నింపుతామన్నారు. ముచ్చుమర్రి ద్వారా సెప్టెంబర్ రెండోవారంలో ఎత్తిపోతల ప్రారంభిస్తామన్నారు. గండికోటతో పాటు హంద్రీ–నీవా ద్వారా వచ్చేనీటితో మూడు జిల్లాలలో తాగునీటి సమస్యను నివారిస్తామన్నారు.

ఎవరివాదన వారిది...

సీబీఆర్ పూర్తిగా అడుగంటిపోవడం, ఎంపీఆర్‌లో నీరు లేకపోవడం, పీఏబీఆర్ ప్రమాదకరస్థాయిలో ఉండటంతో ప్రజాప్రతినిధులు ఎవరికివారు తమ ప్రాంత అవసరాల గురించి మాట్లాడారు. 4 దశాబ్దాలుగా ఐఏబీ సమావేశంలో పాల్గొంటున్నానని, ఇప్పటికీ తాడిపత్రికి సాగునీరు అందించలేకపోతున్నానని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. 'ఇన్నేళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నావు. సాగునీళ్లు ఇప్పించలేకపోతే నువ్వేం నేతవని మా ప్రాంత ప్రజలు నిలదీసే అవకాశం ఉందని, ఆ పరిస్థితి రానివ్వొద్దన్నారు. వచ్చేనీటిలో తొలిప్రాధాన్యతగా తాడిపత్రికి తాగునీరు అందించాలని కోరారు. శింగనమలలో 26 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయని, నీళ్లు రాగానే మొదట టైఎల్‌అండ్ అంటూ పులివెందులకు తీసుకెళ్తున్నారని, శింగనమలకే మొదట నీళ్లు ఇవ్వాలని ఎమ్మెల్సీ శమంతకమణి కోరారు. సీబీఆర్ పరిస్థితి దారుణంగా ఉందని, యుద్ధప్రాతిపదికను నీళ్లు వదలకపోతే పులివెందుల, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాలలోని 850 గ్రామాలకు తాగునీరు ఆగిపోతుందని ఎమ్మెల్యేలు వరదాపురం సూరి, చాంద్‌బాషా తెలిపారు.

చిత్రావతికి ఎప్పుడూ అన్యాయమే



'టీబీడ్యాంలో 64 టీఎంసీలు ఉన్నాయి. ఇన్‌ఫ్లో బాగానే ఉంది. గతంతో పోలిస్తే నీటి లభ్యత తగ్గింది. పీఏబీఆర్, సీబీఆర్‌లు తాగునీటికి నిర్దేశించినవి. సీబీఆర్‌లో 0.1 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పులివెందులలో తాగునీటి పథకాలు పనిచేయడం లేదు. చిత్రావతికి ఎప్పుడూ అన్యాయమే జరుగుతోంది. ఎంపీఆర్ నుంచి వెంటనే సీబీఆర్‌కు నీటిని విడుదల చేయాలి. అలాగే పులివెందుల పరిధిలోని చీనీచెట్లను కాపాడాలి.

– అవినాశ్‌రెడ్డి, ఎంపీ, కడప

ఆలూరు కెనాల్‌కు నీళ్లివ్వండి



ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఖాజాపూర్ రిజర్వాయర్ ఎండిపోయింది. మాకు 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీరు లేకపోయినా ఫర్వాలేదు. మొదట తాగునీరు విడుదల చేయండి. హంద్రీ–నీవా ద్వారా నీరు వస్తే ఆ నీటిని ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు విడుదల చేయాలి.

– గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే, ఆలూరు

తాగు, సాగునీరివ్వాలని ధర్నా



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: తాడిపత్రి నియోజకవర్గం పరిధిలోని గ్రామాలకు తాగు, సాగు నీరివ్వాలని అక్కడి గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సాగునీటి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ క్రమంలో తాడిపత్రి పరిధిలోని మండలాలకు చెందిన రైతులు, ప్రజలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత 50 ఏళ్లగా తమ ప్రాంతాలకు మొదటి విడతలో నీరు ఇవ్వడం లేదన్నారు. రెండో విడతలో అరకొరగా ఇస్తుండటంతో చివరగా ఉన్న చెరువులకు నీరు చేరడం లేదన్నారు. దీంతో తాగు, సాగు నీటికి ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ఈ సారైనా తమకు ముందుగా నీటిని ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

క్రీడా మాణిక్యాలుగా తయారు చేయాలి

డీఈఓ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న డీఈఓ లక్ష్మీనారాయణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: మట్టిలో దాగి ఉన్న క్రీడా మాణిక్యాలను వెలికి తీసే బాధ్యత మీపై ఉందని డీఈఓ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కృష్ణకళా మందిరంలో అనంతపురం డిస్ట్రిక్ట్ సెకెండరీ స్కూల్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏడీఎస్ఎస్ఏఏ) సర్వసభ్య సమావేశానికి ఆయనతో పాటు రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (రైప్) రామకృష్ణ, డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్‌లు అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఏడీఎస్ఎస్ఏఏ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లాలోని పీడీ, పీఈటీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది స్కూల్ గ్రిగ్స్ పోటీలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఏడాది పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లా నుంచి 100 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించారన్నారు. వీటి సంఖ్య మరింతగా పెంచేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ప్రతి పీఈటీ, పీడీలు తమ వంతు బాధ్యతగా క్రీడాకారులను ఉన్నత క్రీడావంతులుగా తీర్చిదిద్ది వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని సూచించారు. క్రీడా సంవత్సరం మొదలవ్వడంతో జిల్లాలో క్రీడా పోటీలను నిర్వహించి జిల్లాను క్రీడా విభాగంలో మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈ ఏడాది 9 జోన్లుగా విభజించడం జరిగిందన్నారు.

ముంబై వరదలతో రైళ్లు ఆలస్యం

గుంతకల్లు: ముంబైలో కురుస్తున్న భారీ వర్షం, వరదల ధాటికి పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని గుంతకల్లు రైల్వే డివిజన్ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ముంబై – చెన్నై మార్గంలో గుంతకల్లు రైల్వే జంక్షన్ మీదుగా నడిచే అన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు. వర్ష ప్రభావం మరో రెండు రోజులుండటం వల్ల రైళ్ల సమయాలు చెప్పలేమని అధికారులు పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు చెక్కులందిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్‌మోద్దీన్

అనంతపురం కల్చరల్: ప్రతిభ కల్గిన ఐదు మంది పేద విద్యార్థులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ రూ.10 వేల చెక్కులనందించారు. నందమూరి బాలకృష్ణ నటించిన 101వ చిత్రం 'పైసా వసూల్' విడుదలవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 101 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున అందించడానికి ఎంపిక చేశారు. ఆ నేపథ్యంలో బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ గౌసుమోద్దీన్ చేతుల మీదుగా సంధ్య, భార్గవ్, వెంకట కార్తీక్, వినయ్‌కుమార్, ఆసిఫ్ తదితరులు చెక్కులనందించారు. ఈ సందర్భంగా గౌస్‌మోద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన విద్యార్థులలో కరువు జిల్లా అయిన అనంతపురానికి చెందిన 5 మందితో పాటు, హిందూపురానికి చెందిన మరో ఐదు మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించామన్నారు. భవ్య క్రియేషన్ అధినేత ఆనంద ప్రసాద్, దర్శకుడు పూరీ జగన్నాథ్‌లు స్వయంగా బాలకృష్ణతో కలిసి చిత్ర విడుదల సందర్భంగా సేవా కార్యక్రమాలను చేయడం అభినందనీయమన్నారు.

షిర్డీలో 'అనంత' కళాకారుల ప్రతిభ



అనంతపురం కల్చరల్: షిర్డీ సంస్థాన్ శతాబ్ది ఉత్సవాల్లో దేశవ్యాప్తంగా కళాకారులు సాయినాథుని సన్నిధిలో కళప్రతిభను ఘనంగా చాటుకున్నారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో నగరానికి చెందిన నాట్యాచార్యులు సూర్యప్రసాద్ శిష్య బృందం కూచిపూడి, భరతనాట్యాలతో సాయిబాబాకు నృత్య నీరాజనాలర్పించారు. అద్భుత ప్రతిభ కనపరచిన సౌమ్య, కావ్య, శ్రావణి, సాయికీర్తన, రాధికలను సంస్థాన్ నిర్వాహకులు కోటీ ఉల్లాస్, లక్ష్మణ్‌జీ, దేశ్‌పాండే తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు మాట్లాడుతూ షిర్డీ క్షేత్రంలో తొలిసారి అనంతవాసులకు బాబా ఎదుట ప్రదర్శించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

అభాగ్యులకు అమ్మ


అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

మౌనం అంటే ప్రార్థన
ప్రార్థనంటే ఓ నమ్మకం
నమ్మకమంటే ప్రేమ
ప్రేమంటే ఓ సేవ
సేవలోనే సంతృప్తి

విశ్వమాత మదర్‌థెరిసా నమ్మిన సిద్ధాంతమిది.. ఆమె అడుగుజాడల్లో పయనిస్తున్నాడో యువకుడు. అనాథలకు 'అమ్మ'లా.. అన్నార్థులకు 'అన్న'లా.. కన్నవారి సంరక్షణకు నోచుకోని వృద్ధులకు 'కొడుకు'లా ఉంటూ సేవాపథంలో పయనిస్తున్నారు. అందరూ గొప్ప పనులు చేయలేదు.. కానీ చిన్న పనులైనా 'ప్రేమ'తో చేయవచ్చని నిరూపిస్తున్నాడు. - అనంతపురం మెడికల్

శింగనమల మండలం తరిమెలకు చెందిన రమణారెడ్డి 1997లో డిగ్రీ చదివే రోజుల్లోనే స్నేహితుల సహకారంతో 'అమ్మ' స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. అప్పట్లో మెదడు వాపు వ్యాధితో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు నిరంతరాయంగా పౌష్టికాహారం అందజేశారు. ఇదే సమయంలో రక్తం అందక ఎంతో మంది మృత్యువాత పడుతున్న ఘటనలు ఆయన మనసును కలచివేశాయి. 'రక్తదానం..మహాదానం' నినాదంతో పెద్ద ఎత్తున రక్తదాన ఉద్యమాన్ని చేపట్టారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మందికి తోడుగా నిలిచారు. అలాగే నా అన్న వారు లేక 'అనాథ'లుగా బతుకీడుస్తున్న వారికి చేయూతనందించారు. మృత్యువాత పడితే అంత్యక్రియల సేవ ప్రారంభించారు. సంపాదిస్తున్న మొత్తంలో కొంత పక్కకు తీసి దాతలు, స్నేహితుల సహకారంతో ఎంతో మందికి అండగా నిలుస్తున్నారు. ఇప్పటికీ నగరంలోని కొన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని కొనసాగిస్తున్నారు. అనాథ ఆశ్రమ విద్యార్థులకు కావాల్సిన వైద్య సదుపాయాలు అందజేస్తున్నారు. అనంతలోని 'ఆదరణ మానసిక వికలాంగుల ఆశ్రమం'లో అమ్మ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వేసవిలో రక్షిత మంచి నీటి సదుపాయం ఏర్పాటు చేశారు. 12 ఏళ్లుగా వందలాది మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు. నగరంలోని వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు ఇవ్వడంతో పాటు మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఏటా మదర్ థెరీసా జయంతి పురస్కరించుకుని పేద విద్యార్థులకు, వృద్ధులకు, మానసిక వికలాంగులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. 'అమ్మ' సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో అధికారులు, ప్రముఖులను భాగస్వాముల్ని చేస్తున్నారు. ఈ క్రమంలో వారు సైతం పేదలకు చేయూతనిస్తున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీటీ డైరెక్టర్ మాంఛోఫెర్రర్, జేఎన్‌టీయూ మాజీ రిజిస్ట్రార్ హేమచంద్రారెడ్డి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది శైలజ, ఇక్కడ ఎస్పీగా పని చేసిన రాజశేఖర్‌బాబు.. ఇలా ఎంతో మంది ప్రముఖులు 'అమ్మ'కు తోడుగా నిలుస్తున్నారు.


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాంఛోఫెర్రర్



అడ్వాన్స్ ఫౌండేషన్ కోర్సు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

'సాక్షి' కథనానికి స్పందనగా

అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామానికి చెందిన గోపీనాథ్ గౌహతిలో బీటెక్ చదువుతుండేవాడు. మెదడు సంబంధిత వ్యాధితో బాధపడ్డాడు. రూ.లక్షలు ఖర్చు చేసినా నయం కాలేదు. ఇదే సమయంలో 'తల్లిడిల్లితున్న తపన' శీర్షికతో సాక్షి కథనం ప్రచురించింది. స్పందించిన రమణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. యువకుడు ఆహారం తీసుకునేందుకు సైతం ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో న్యూట్రీషియన్ పౌడర్, ఆర్థికసాయం చేసి మానవీయతను చాటుకున్నారు. భవిష్యత్‌లో కూడా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

సేవలోనే సంతృప్తి



ఎదుటికి మనిషికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంది. అదే నాకు సంతృప్తి. 20 ఏళ్లుగా నిర్విఘ్నంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నా. స్నేహితులు, కొందరు అధికారులు భుజం తట్టి ప్రోత్సహిస్తున్నారు. చివరి శ్వాస వరకు సేవా కార్యక్రమాలు చేపడతా.

– రమణారెడ్డి, అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు

ఇద్దరు మానసిక వికలాంగుల దత్తత

అనంతపురంలోని అనంత సాగర్ కాలనీకి చెందిన జయమ్మ భర్తను కోల్పోయింది. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో రాజ్యలక్ష్మి, రాజశేఖర్ మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. 'ఆదరణ' మానసిక వికలాంగులు, చెవిటి పిల్లల పాఠశాలలో చదువుతున్నారు. కుటుంబం గడవడమే కష్టంగా ఉన్న తరుణంలో రమణారెడ్డి స్పందించి ఇద్దరినీ దత్తత తీసుకున్నారు.

జీవన సమరం

భర్త మరణం...భవిష్యత్ శూన్యం

- ఏడేళ్లుగా మొండిగోడల కిందే జీవనం
- పింఛన్ అందదు..రేషన్ కార్డు మంజూరు కాదు
- కుమారుడి భవిత కోసం ఓ తల్లి ఆరాటం

పార్వతి, ఆమె కుమారుడు ఉంటున్న స్థలం


కట్టుకున్న వాడు అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. ఆదుకోవాల్సిన బంధువులు మొహం చాటేశారు. అయినా ఒక్కగానొక్క కొడుకును బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనే ధ్యేయంతో ఓ ఒంటరి మహిళ జీవనం పోరాటం చేస్తోంది. మొండిగోడల మధ్యే నివాసం ఉంటూ మొక్కవోని ధైర్యంతో ముందుకుసాగుతోంది.

– ముదిగుబ్బ


కొడుక్కి అన్నం తినిపిస్తున్న పార్వతి

మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన సి. పార్వతి, రాము దంపతులు. వీరికి రాజేష్ సంతానం. అనంతపురంలో కాపురం పెట్టిన రాము...ఆటో నడుపుతూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించేవాడు. అయితే రాము అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి పార్వతికి కష్టాలు మొదలయ్యాయి. బంధువుల ఆదరణ నోచుకోక...కొడుకును సాకలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అయినా తన కొడుకును బాగా చదివించాలని భావించి మకాంను స్వగ్రామైన నక్కలపల్లికి మార్చింది. అక్కడ కూడా ఆశ్రయం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో...బంధువులకు చెందిన మొండిగోడల ఇంటిని నివాసంగా మార్చుకుంది. కూలిపనులు చేసుకుంటూ కుమారుడిని ఏడో తరగతి చదివిస్తోంది.

పట్టించుకోని సర్కార్

వింతంతువైన పార్వతికి అర్హత ఉన్నప్పటికీ అధికారులు ఆమెకు రేషన్ కార్డు మంజూరు చేయలేదు. దీంతో ఇటు పింఛన్, అటు ఇల్లు మంజూరు కాక పార్వతి తల్లడిల్లిపోతోంది. ఏడేళ్ల కనిపించిన అధికారినంతా వేడుకుంటోంది. తనపై దయ ఉంచి పింఛన్, రేషన్‌కార్డు మంజూరు చేయాలని వేడుకుంటోంది.



సైనికుడు

దేశ రక్షణలో మేముసైతం

- రైతు బిడ్డలు...సైన్యంలో జవానులు
- ఆర్మీ వైపు మొగ్గుచూపుతున్న ఆత్మకూరు యువత

"జననీ జన్మభూమిశ్చ...స్వర్గాదపీ గరీయసి... ఏ తల్లి నిను కన్నదో...ఆ తల్లినే కన్న భూమి భారతి గొప్పదిరా"...అంటూ ఓ సినీకవి మాతృభూమి గురించి రాసిన మాటలు ఆ యువకుల మనసుల్లో నాటుకు పోయాయి. అందుకే ఉన్న ఊరిని కన్న తల్లిదండ్రులను వీడి...దేశసేవలో సరిహద్దు లో సమరానికి సిద్ధమయ్యారు. ఒకరిని చూసి మరొకరు...ఒకరి వెంట మరొకరు ఇలా...ఆత్మకూరు యువత దేశ సేవలో తరిస్తుండగా...వారిని కన్నవాళ్లంతా గర్వంతో పొంగిపోతున్నారు.

- ఆత్మకూరు



మంచుకొండల్లో జాతీయ జెండాతో మన జవాన్లు

శ రక్షణ వ్యవస్థలో భారత సైనిక దళం (ఇండియన్ ఆర్మీ) ఒకటి. ఈ ప్రధాన కర్తవ్యం... భూ భాగాన్ని పరిరక్షించడంతో పాటు దేశంలో శాంతి ను కాపాడుతూ దేశ సరిహద్దుల భద్రతను పర్యవేక్షించడం. ఇలా దేశ రక్ష లుపంచుకునేందుకు ఆత్మకూరు మండలానికి చెందిన పలువురు యువకు గ్గు చూపుతున్నారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తుండడంతో ంలో సైనికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే 150 పైగా యువకులు ఆర్మీలో సేవలందిస్తున్నరు. కన్న వారి కలలను సహ స్తూ...దేశ రక్షణలో మేముసైతం అంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తు

ా...ఇష్టపడి..

సైనిక దళాల్లో పనిచేయడం అంత సులువైన విషయం కాదు. కఠోర శిక్ష ికూల పరిస్థితుల్లో విధుల నిర్వహణ..ఇలా ప్రతిదీ కష్టంతో కూడుకున్నదే. ల్లో కాపాలా ఉండే సైనికులకు పగలు..రాత్రి తేడా ఉండదు..నిరంతరం ఉంచాల్సిందే. కొండలు..మంచు పర్వతాల్లో విధులు నిర్వర్తించాల్సి ది. రక్తం గడ్డకట్టే మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతల్లోనూ విధి నిర్వహణలో అంకిత ో పనిచేయాలి. అయినప్పటికీ యువత ఇష్టపడి మరీ దేశ రక్షణలో ంచుకుంటున్నారు. ఒక్కోసారి కుటుంబీకులతో మాట్లాడటం కూడా నెలల కుదరదు. ఇక వివాహితులైతే కుటుంబాన్ని వదిలి విధులకు వెళ్లాల్సిన లుంటాయి. అయినప్పటికీ దేశ రక్షణ కోసం ప్రాణాలైనా అర్పిస్తామంటూ రంతో చెబుతున్నారు.

ాస్తున్న తల్లిదండ్రులు

ప్రాణం..గాల్లో దీపంలాంటింది...ఎప్పుడు యుద్ధం వస్తుందో...ఎక్కడ ం పొంచి ఉంటుందో తెలియదు. నిత్యం ప్రాణాలతో చెలగాలం. అందుకే డ్డలను ఆర్మీలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రారు. కానీ ఆత్మ ుండలలలోని చాలా మంది తల్లిదండ్రులు దేశ భద్రత కోసం తమ బిడ్డ నాదిరాళ్లుగా మలుస్తున్నారు. ఆర్మీలో ఉద్యోగం కోసం శిక్షణ కేంద్రాల్లో వారిని ప్రోత్సహిస్తున్నారు.

గర్వంగా ఉంది

ఇండియన్ ఆర్మీలో పని చేయడం గర్వంగా ఉంది. మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కష్టపడి చదివించారు. వారి కష్టాన్ని చూసి పట్టుదలతో శ్రమించి ఉద్యోగం సంపాదించా. సైనికుడిగా మంచిపేరు తెచ్చుకుని నా తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడటానికి ఎంత కష్టమైనా భరిస్తా. – మనోజ్ ప్రభాకర్‌రెడ్డి



నా జీవితం దేశరక్షణకే

నాకు 19 సంవత్సరాల వయసులోనే ఆర్మీలో ఉద్యోగం వచ్చింది . బెంగళూర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నా. దేశ రక్షణ కోసం జీవితాంతం పని చేయడానికి సిద్ధం. పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడమే నాధ్యేయం . – కార్తిక్



దేశరక్షణకు ప్రాణాలైనా అర్పిస్తా

నాకు సైన్యంలో ఉద్యోగం వచ్చి నాలుగు సంవత్సరాలవుతోంది. విధి నిర్వహణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో పనిచేశాను. ప్రస్తుతం ఢిల్లీలో విధులు నిర్వర్తిస్తున్నాను. ఆర్మీలో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. దేశ రక్షణకు ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధం –కొండారెడ్డి



తల్లిదండ్రులతో సెల్ఫీ తీసుకుంటున్న సైనికుడి పేరు మనోజ్ ప్రభాకర్ రెడ్డి. జరాత్‌లోని భూజ్ అనే జిల్లాలో పని చేస్తున్నాడు. ఆరు నెలలకోసారి ంతూరు ఆత్మకూరుకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులకు, స్నేహితులకు హుమతులు తీసుకువస్తుంటాడు. వాటిని చూసి వారంతా ఎంతో ఆనంద పడు ంటారు. ప్రస్తుతం వినాయకచవితి పండుగకు వచ్చి కుటుంబ సభ్యులతో ఇలా నందంగా గడుపుతున్నాడు. ఎప్పుడైనా ఇక్కడి వారు గుర్తుకువస్తే స్నేహితులు, ంధువులతో గడిపిన రోజులను గుర్తు చేసుకుంటానని చెబుతున్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పార్వతి. ఆత్మకూరులో హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈమె తనయుడు చంద్ర ఆర్మీలో ఉంటూ లక్నోలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమారుడు గుర్తుకు వచ్చినప్పుడల్లా ఫోన్ చేసి మాట్లాడుతుంది. ఒక్కోసారి ఫోన్‌లో అందుబాటులో రాకపోతే... కుమారుడే మళ్లీ ఫోన్ చేసే దాకా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తుంటుంది. ఒక్కసారి కుమారుడి గొంతు వింటే ఆందోళనంతా మాయమై పోతుందని చెబుతుంది. అక్కడ వాడు ఎంత కష్టపడుతున్నాడోనన్న ఆందోళన ఉన్నా...దేశ సేవకు మా కుటుంబం నుంచీ ఒకరిని పంపామన్న సంతృప్తి నిస్తోందని చెబుతోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు లక్ష్మీదేవి. కుమారుడు భాస్కర్ సైన్యంలో ఉంటూ ప్రస్తుతం బీహార్‌లో భాద్యతలు నిర్వహిస్తున్నాడు. పండుగలు...శుభకార్యాల్లో తమ కుమారుడు తమతో పాటు ఉండకపోవడం బాధగా ఉన్నా....దేశ సేవలో తరిస్తున్నాడని గర్వంగా ఉందని గొప్పగా చెబుతుంది లక్ష్మీదేవి. గుర్తుకు వస్తే మాత్రం ఫోన్ చేసి మాట్లాడుతుంటాను అంటూ ఆనందంగా చెబుతోంది.



వయ్యారిభామతో పంటలకు ప్రమాదం



వేరుశనగ, పత్తి, జొన్న, కందిలో సస్యరక్షణ చర్యలు


ఏఆర్‌ఎస్‌ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ బి.రవీంద్రనాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్‌:

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పంట పొలాలు పరిసర ప్రాంతాల్లో వయ్యారిభామ లాంటి ప్రమాదకరమైన కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉన్నందున వాటిని నివారించుకోవాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ బి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. ఖరీఫ్‌లో వేసిన పంటలకు ఆశించిన తెగులు, చీడపీడల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

- వేరుశనగ పంట ప్రస్తుతం కొన్ని చోట్ల శాఖీయ దశ, మరికొన్ని ప్రాంతాల్లో ఊడలు దిగే దశలో ఉన్నందున అక్కడక్కడా రసంపీల్చు పురుగు ఆశించింది. ఈ క్రమంలో తామరపురుగుల నివారణకు ఎకరాకు 320 మి.లీ మోనోక్రోటోఫాస్‌ + 1 లీటర్‌ వేపనూనె + ఒక కిలో సబ్బుపొడి 200 లీటర్ల నీటికి కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. కొన్ని ప్రాంతాల్లో శనగపచ్చ పురుగు ఆశించినందున 1.5 గ్రాములు లార్విన్‌ లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేయాలి. విత్తుకున్న 45 రోజుల్లోగా కలుపు లేకుండా అంతరకృషి చేసుకోవాలి. వయ్యారిభామ లాంటి కలుపు మొక్కలు లేకుండా నాశనం చేసుకోవాలి. లేదంటే ప్రమాదకరమైన మొవ్వ కుళ్లు, కాండంకుళ్లు తెగులు సోకే అవకాశం ఉంది.
- పత్తిలో గులాబీరంగు పురుగు ఉన్నట్లు గమనిస్తే తొలుత 5 శాతం వేపగింజల కషాయం లేదా 5 మి.లీ వేపనూనె లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనిస్తే 2 మి.లీ క్వినాల్‌ఫాస్‌ లేదా 2.5 మి.లీ క్లోరోఫైరిపాస్‌ లేదా 1 గ్రాము థయోడికార్బ్‌ లేదా 2 మి.లీ ప్రొఫినోఫాస్‌ లీటర్‌ నీటికి కలిపి పంట బాగా తడిచేలా 10 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉనికి, ఉధృతి తెలుసుకునేందుకు ఎకరాకు 4 నుంచి 6 ఫిరమోన్‌ ఎరలు ఏర్పాటు చేయాలి.
- వరిలో అక్కడక్కడ కాండంతొలిచే పురుగు ఆశించినందున 2.5 మి.లీ క్లోరోఫైరిపాస్‌ లేదా 1.5 గ్రాములు అసిఫేట్‌ లేదా 2 గ్రాములు కార్టాప్‌ హైడ్రోక్లోరైడ్‌ లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. సుడిదోమ ఆశించిన పొలాల్లో ఎకరాకు 330 మి.లీ అప్లాడ్‌ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదులుకోవాలి.
- ఇటీవల వర్షాలకు విత్తిన కంది పంటకు సంబంధించి మొలకెత్తిన వెంటనే ముక్కుపురుగు ఆశించే అవకాశం ఉంది. ఒక నూలుగుడ్డలో 5 కిలోల మలాథియాన్‌ పొడిమందు ఎకరా పొలంలో మొక్కలపైన చల్లాలి. మొక్కలు ఒత్తుగా లేకుండా జాగ్రత్త పడాలి. 30 రోజుల్లోగా కలుపు లేకుండా చూసుకోవాలి.
- ఇటీవల కురిసిన వర్షాలకు ఆముదం పంటలో పైపాటుగా ఎకరాకు 6 కిలోలు యూరియా వేసుకోవాలి.
- ఇటీవల వేసిన జొన్నకు కాండంతొలుచు పురుగు ఆశించినందున ఎకరాకు 320 మి.లీ మనోక్రోటోఫాస్‌ లేదా 60 మి.లీ రేనాక్సిపైర్‌ 200 లీటర్ల నీటికి కలిపి మొలకెత్తిన 10 నుంచి 12 రోజుల్లోగా పిచికారీ చేసుకోవాలి.



భిక్షాటనతో గోపాలమిత్రల నిరసన


మూకటితో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న గోపాలమిత్రలు

అనంతపురం అగ్రికల్చర్‌: అకారణంగా తమను విధుల నుంచి తొలగించడంతో ఉపాధిలేక రోడ్డున పడ్డామని విధుల నుంచి తొలగించిన గోపాలమిత్రల సంఘం నాయకుడు వెంకటేష్‌ ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం అందరి వద్ద మోకరిల్లుతున్నా... తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లోకి తీసుకోవాలంటూ స్థానిక పశుశాఖ, డీఎల్‌డీఏ కార్యాలయం ఎదుట గోపాలమిత్రలు చేపట్టిన ఆందోళన కార్యక్రమం బుధవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గోపాలమిత్రలు కలెక్టరేట్‌ ఎదుట మూకటి చేతపట్టుకుని భిక్షాటనతో నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఉపాధి లేక రోడ్డున పడిన తమకు భిక్షం వేయాలని కోరారు. డీఎల్‌డీఏ కక్షకట్టి తమను తొలగించారని విమర్శించారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. అంతవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్దన్న, ఓబుళపతి, గురివిరెడ్డి, ఓబయ్య, జగన్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, బాలరాజు, కృష్ణ పాల్గొన్నారు.

35 మండలాల్లో చిరుజల్లులు

అనంతపురం అగ్రికల్చర్‌: జిల్లా వ్యాప్తంగా బుధవారం 35 మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. చిలమత్తూరు, హిందూపురం, లేపాక్షి, అగళి, అమడగూరు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, రాయదుర్గం, కనేకల్లు, తాడిపత్రి, డి.హిరేహాళ్‌ మండలాల్లో తేలికపాటి జల్లులు, మిగతా మండలాల్లో తుంపర్లు కురిశాయి. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 88.7 మి.మీ కాగా 10 శాతం అధికంగా 96.8 మి.మీ నమోదైంది. అలాగే జూన్‌ ఒకటి నుంచి ఇప్పటివరకు 218.8 మి.మీ గానూ 15 శాతం తక్కువగా 187 మి.మీ వర్షపాతం నమోదైంది.

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం

- జేడీఏ శ్రీరామమూర్తి


కంది సాగుపై రైతులకు సూచనలిస్తున్న జేడీఏ శ్రీరామమూర్తి

గుత్తిరూరల్‌: సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ జేడీఏ శ్రీరామమూర్తి తెలిపారు. అందులో భాగంగానే సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో అనుభవం కలిగిన రైతులను నియమించామన్నారు. బుధవారం ఆయన తాను దత్తత తీసుకున్న మండలంలోని ధర్మాపురం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఏ శ్రీనివాసరావుతో కలిసి కంది, జొన్న, నవధాన్య, వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం ఐదేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులతో చర్చించారు. ప్రతి రైతు రసాయన రహిత వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. జిప్సం, పెసలు, జొన్న, ఉలవ విత్తనాలను ప్రభుత్వం 100 శాతం రాయితీతో అందజేస్తోందని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో వర్షాధార పథకం కింద రూ.20 లక్షలతో నిర్మించిన స్టోరేజీ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 మంది రైతులకు గొర్రెలు, పొట్టేళ్లను పంపిణీ చేశారు. నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏలు వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, ఏఓలు వెంకట్రాముడు, శ్రీవాణి, రూఫస్‌ రొనాల్డ్‌, ఏఈఓ మురళి, ఎంపీఈఓ నరసింహులు, సర్పంచ్‌ శ్రీనివాస్‌ చౌదరి, బేతాపల్లి సర్పంచ్‌ నాగేంద్ర పాల్గొన్నారు.

బిజినెస్‌ ప్లాన్‌తో లాభాలు బాగు


హాజరైన ఆంజనేయ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు

అనంతపురం అగ్రికల్చర్‌: వ్యాపార ప్రణాళిక (బిజినెస్‌ ప్లాన్‌) తయారు చేసుకుని పద్ధతి ప్రకారం కంపెనీ నిర్వహించుకోవడం వల్ల తప్పకుండా లాభాలు వస్తాయని ఉద్యానశాఖ ఏడీ–1 జి.సతీష్‌, ఏపీఎంఐపీ ఏపీడీ జి.చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఆంజనేయ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ(ఎఫ్‌పీఓ) సర్వసభ్య సమావేశంలో వారు కంపెనీ నిర్వహణ, అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాల గురించి వివరించారు. రైతులు సమష్టిగా ఉంటే ప్రభుత్వం నుంచి ఉద్యానశాఖ నుంచి పథకాలు, రాయితీలు అందుతాయని తెలిపారు. అలాగే పంట వేసుకోవాలన్నా, పండిన ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా, ఇతరత్రా ఇన్‌పుట్స్‌ అవసరమైనా కంపెనీలు రైతు ముంగిటకే వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా ఆంజనేయ ఎఫ్‌పీఓకు గుర్తింపు లభించిందన్నారు. క్రమం తప్పకుండా సమావేశాలు, ఆడిట్‌ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ప్రతినిధులు భాస్కర్‌, పాపిరెడ్డి, ప్రకాష్‌, వెంకటేశులు, జిక్రియా పాల్గొన్నారు.

పనిచేయకపోతే పంపించేస్తా

సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు హెచ్చరిక



అనంతపురం టౌన్‌:

పని చేయని వారిని ఇంటికి పంపేందుకు కూడా వెనుకాడేది లేదని డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఎవరైనా సరే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదన్నారు. బుధవారం ఆయన జిల్లాలోని ఏరియా కోఆర్డినేటర్లు, ఏపీఎంలు, ఇతర అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో వెయ్యి కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్‌ చేయాలని లక్ష్యంగా ఉంచుకున్నామన్నారు. ఇప్పటి వరకు 558 కిలోమీటర్ల పరిధిలో 2 లక్షల 16 వేల గుంతలు తవ్వి లక్షకు పైగా మొక్కలు నాటామన్నారు. అటవీశాఖ నుంచి ఆరు అడుగులకు పైగా ఎత్తున్న మొక్కలు సేకరించినట్లు చెప్పారు. ఇంకా మొక్కలు అవసరం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసేందుకు కలెక్టర్‌ నుంచి అనుమతి పొందినట్లు చెప్పారు. అందరూ సమన్వయంతో పని చేసి గుంతలు తీయడం, మొక్కలు నాటడంపై దృష్టిసారించాలన్నారు.

6 వేల ఎకరాల్లో పండ్లతోటలు

జిల్లా వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1,500 ఎకరాల్లో పండ్ల తోటలు సాగులో ఉన్నా... ఆన్‌లైన్‌లో 950 ఎకరాలు మాత్రమే నమోదు చేశారని, మిగిలినవి కూడా ఆన్‌లైన్‌ చేయాలన్నారు. పెద్దపప్పూరు, శింగనమల, నల్లమాడ మండలాలు పండ్ల తోటల సాగు చివరి మూడు స్థానాల్లో ఉన్నాయన్నారు. రెండ్రోజుల్లో పరిస్థితిలో మార్పు రాకుంటే అక్కడికి కొత్త అధికారులను పంపాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్‌పీఏ సంఘాలను గుర్తించి వన్‌టైం సెటిల్‌మెంట్‌ కోసం తీర్మానం చేసి బ్యాంకుల్లో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వారం పాటు ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు 50 వేల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, అన్నింటికీ జియో ట్యాగింగ్‌ చేయించాలన్నారు. ప్రధానంగా చంద్రన్న బీమాలో నమోదైన వారి వివరాలను పరిశీలించాలన్నారు. సెప్టెంబర్‌ 1 నుంచి కొత్త వాళ్లను నమోదు చేయించాలన్నారు. తాజాగా ఔట్‌ సోర్సింగ్‌ కింద పని చేస్తూ ఈపీఎఫ్‌ లేని వాళ్లందరినీ చంద్రన్న బీమాలో చేర్చేలా ఆదేశాలు అందినట్లు చెప్పారు. ఈ క్రమంలో అందరూ చంద్రన్న బీమాపై అవగాహన కల్పించాలన్నారు. కాన్ఫరెన్స్‌ సందర్భంగా కొందరు ఉద్యోగులు అందుబాటులోకి రాకపోవడంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

1,147 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ విత్తన పంపిణీలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా 6,559 మంది రైతులకు 1,147 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ పీవీ శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 510 క్వింటాళ్ల ఉలవలు, 440 క్వింటాళ్ల అలసందలు, 189 క్వింటాళ్ల పెసలు పంపిణీ జరిగిందన్నారు. మొత్తమ్మీద ఇప్పటి వరకు 33,888 మంది రైతులకు 5,938 క్వింటాళ్లు అందజేశామన్నారు. డిమాండ్ ఉన్న మండలాల్లో విత్తన పంపిణీ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

'సీమ' అభివృద్ధిపై చర్యలేవీ ?

అనంతపురం అర్బన్:



మాట్లాడుతున్న జి.ఓబులు

రాయలసీమ కరువుని ప్రభుత్వాలు అంగీకరిస్తున్నప్పటికీ అభివృద్ధికి చర్యలు చేపట్టడం లేదని సీపీఎం రాయలసీమ అభివృద్ధి సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు విమర్శించారు. రాయలసీమ వెనుకబాటు, సమస్యలు, పరిష్కార మార్గాలు, తదితర అంశాలు అభివృద్ధి చేపట్టాల్సిన విధానాలపై కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 17న జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కరువు కారణంగా జిల్లాలో రైతుల ఆత్మహత్యలు, వలసలు చోటు చేసుకున్నాయన్నారు. స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లు పూర్తయినా నేటికీ వ్యవసాయ భూమికి 15 శాతంలోపై నీటి పారుదల ఉందని, మిగతా భూమి వర్షాధారంపై ఆధాపడాల్సిన దుస్థితి ఉందన్నారు. సీమలో చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేకపోవడం ప్రజలకు ఉపాధి కరువైందన్నారు. ఈ క్రమంలో రాయలసీమ అభివృద్ధిపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వివిధ అంశాలపై సెమినార్ జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న డీసీసీబీ ఉద్యోగుల నిరసన



మాట్లాడుతున్న సంఘం నేత డి.రుష్యేంద్రబాబు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)పై సహకారశాఖ రిజిస్ట్రార్ వేసిన సెక్షన్ 51 విచారణ వెంటనే నిలిపేయాలని బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రుష్యేంద్రబాబు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా బుధవారం డీసీసీబీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రుష్యేంద్ర బాబు మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న విచారణ కార్యక్రమాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు, ఖాతాదారులకు సేవలందిస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులు, సిబ్బందిని ఇబ్బంది పెట్టేలా వ్యవహారం సాగుతోందని విమర్శించారు. విచారణను రద్దు చేసేదాకా ఆందోళన కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ 4 నుంచి డీసీసీబీ ఎదుట రిలేదీక్షలు ప్రారంభిస్తామని తెలిపారు. రోజుకు 8 మంది ఉద్యోగులు దీక్షలో పాల్గొంటారన్నారు. నిరసన కార్యక్రమంలో డీసీసీబీ ఉద్యోగ సంఘం నాయకులు సుఖదేవబాబు, అనంతపద్మనాభం, ఎస్.రమేష్, రమణారెడ్డి, శ్రీధర్, దుర్గాప్రసాద్, ఎన్.ప్రసన్నలక్ష్మి, బి.అనంతలక్ష్మి, రాధిక, రమాదేవి, సుజాత, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ విరమణ చేయనున్న విద్యాశాఖ ఏడీ



చంద్రలీల

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నన్నం చంద్రలీల గురువారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. 2012 జూన్‌లో పదోన్నతిపై ఇక్కడికి వచ్చిన చంద్రలీల ఐదేళ్లకు పైగా పని చేశారు. నెల్లూరు జిల్లా కావలి తాలూకా కౌరుగుంట (మసునూరు) గ్రామానికి చెందిన చంద్రలీల ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 1980లో విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. చిత్తూరు డీఈఓ కార్యాలయంలో మూడు నెలల శిక్షణ పొందిన అనంతరం అదే జిల్లా శ్రీకాళహస్తికి బదిలీ చేశారు. అక్కడే 12 ఏళ్లు పని చేసిన అనంతరం 1992లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది చిత్తూరుకు బదిలీ అయ్యారు. 1999లో సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది టెక్స్‌బుక్స్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. 2010లో కర్నూలుకు ఆడిటర్‌గా బదిలీ అయ్యారు. 2012లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది జిల్లాకు వచ్చారు. ఓవైపు ఏడీతో పాటు మరోవైపు ధర్మవరం డివిజన్ డిప్యూటీ డీఈఓగా సుమారు నాలుగేళ్లు సమర్థవంతంగా పని చేశారు. ఈ సందర్భంగా చంద్రలీల అనంతపురం జిల్లాలో పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు, ప్రజలు చాలా ఆప్యాయత, ప్రేమ, అభిమానంగా మాట్లాడతారన్నారు. చంద్రలీల ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యాశాఖ సిబ్బంది గురువారం మధ్యాహ్నం స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సన్మానసభ ఏర్పాటు చేశారు.

ఆర్పీఎఫ్‌లో ఉద్యోగ అవకాశాలు

అనంతపురం న్యూటౌన్: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)లో 19,952 కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల సంక్షేమాశాఖాధికారి వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 14 లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు www. indian railways.gov. in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

'ప్రతిభా' వంతులు వీరే

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 2016-17 విద్యాసంవత్సరంలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డులకు ఎంపిక చేసింది. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ కడప, నెల్లూరు జిల్లాలోని అనుబంధ కళాశాల్లోని ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంపికయ్యారు. బీటెక్, బీఫార్మసీలో 35 మంది, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏలో 28 మందికి ప్రతిభా అవార్డులు దక్కాయి.

2న రక్తదాన శిబిరం

అనంతపురం రూరల్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ 2న డ్రైవర్స్ కాలనీలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఏకేఎస్ ఫయాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలకు అన్నదానం

అనంతపురం టౌన్: నగరంలోని మారుతీనగర్‌లో ఉన్న ఝూన్సీ లక్ష్మీబాయి నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర మీట్ అండ్ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజారావు, మసీదు కమిటీ అధ్యక్షుడు జాఫర్ వలి, సలీం, నిజాముద్దీన్, సుదర్శన్, చంద్ర, జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అనంతపురం సెంట్రల్: నగరంలో మెడికల్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందాడు. యాచిస్తూ జీవించే వ్యక్తి అనారోగ్యంతో చనిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నేటి సమాచారం

కరుణశ్రీ జయంతి

అనంతపురం కల్చరల్: జగర్లపూడి స్మారకనిధి, కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'కరుణశ్రీ జయంతి' సందర్భంగా మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్యామసుందర శాస్త్రి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కర్రసాము క్రీడా జట్ల ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: సబ్–జూనియర్, జూనియర్, సీనియర్ కర్రసాము జిల్లా జట్ల ఎంపిక గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు బుధవారం కర్రసాము అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

సంచార జాతుల సమావేశం

అనంతపురం న్యూటౌన్: సంచార జాతుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కృష్ణ కళామందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

అనంతపురం రూరల్:



మాట్లాడుతున్న తహసీల్దారు అన్వర్ హుస్సేన్

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ అన్వర్‌హుస్సేన్ పిలుపునిచ్చారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో మండల అధికారులతో పాటు, ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలను భారంగా భావిస్తూ అతి చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేస్తున్నారని, అలాంటి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై వారికి అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్యామలమ్మ, ఎంపీపీ మాధవిలు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయడం వల్ల వారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఓబుళమ్మ, అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులకు జింకపిల్ల అప్పగింత



జింకపిల్లను అటవీశాఖ అధికారులకు అందజేస్తున్న సీఐ కృష్ణమోహన్

అనంతపురం సెంట్రల్: ప్రమాదంలో ఉన్న జింకపిల్ల సురక్షితంగా పట్టుకున్న పోలీసులు బుధవారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. రూరల్ మండలం ఆలమూరు గ్రామానికి చెందిన చంద్రాయుడు ఓ పెళ్లి వేడుకల్లో పాల్గొనేందుకు వ్యక్తిగత పని నిమిత్తం నరసనాయునికుంటకు వెళ్లారు. అక్కడ అటవీప్రాంతంలో జింక పిల్లను కుక్కలు తరుముతున్న విషయాన్ని గమనించాడు. వెంటనే స్పందించి కుక్కల బారి నుంచి జింకను రక్షించి రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చాడు. అనంతరం సీఐ కృష్ణమోహన్ సమక్షంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహబూబ్‌బాషాకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన్ను అభినందించారు. కుక్కల దాడిలో జింక పిల్ల కంటికి తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం పుట్టపర్తి వన్య ప్రాణుల సంరక్షణా కేంద్రానికి తీసుకెళ్లారు.

మార్కెట్‌లోకి కున్ హ్యుండాయ్ కొత్త వాహనం



నూతన కారును విడుదల చేస్తున్న సీఐ కృష్ణమోహన్

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని ప్రముఖ కున్ హ్యుండయ్ కార్ల షోరూంలో నూతన వెర్నా గ్లోబల్ సెడాన్ కారును బుధవారం లాంఛనంగా విడుదల చేశారు. రూరల్ సీఐ కృష్ణమోహన్, ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, జగదీష్ చేతుల మీదుగా కొత్త వాహనాన్ని ప్రారంభించారు. సరికొత్త హంగులతో అత్యాధునికంగా కారును తీర్చి దిద్దినట్లు కంపెనీ ఎండీ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది భాస్కర్‌నాయుడు, జనరల్ మేనేజర్ శివప్రకాష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అరంగేట్రంతోనే ఆకట్టుకున్న చిన్నారులు



నాట్యం చేస్తున్న పట్నం శిష్యబృందం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన గురుకృప నృత్య కళానికేతన్ పట్నం శివప్రసాద్ శిష్యబృందం అరంగేట్రం(రంగపూజ) కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. వినాయక కౌతం, అన్నమాచార్య కీర్తనలు, రామాయణ శబ్దం తదితర వాటిపై చిన్నారులు అద్భుత అభినయంతో ఆకట్టుకున్నారు. బుధవారం రాత్రి స్థానిక శారదా శంకర మఠంలో జరిగిన నాట్య ప్రవేశ కార్యక్రమంలో చిన్నారులు ప్రతిభ, కృతిక, స్నేహిత, లాలిత్య అరంగేట్రం చేశారు.

బాస్కెట్‌బాల్, షటిల్ టోర్నీలో ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన బాస్కెట్‌బాల్ టోర్నీలో స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పదో తరగతి హర్ష, కైఫ్, జీవన్, 9వ తరగతి ఆకాష్, 8వ తరగతి కృష్ణ కార్తీక్, నితీష్ సత్తా చాటి రన్నర్స్‌గా నిలిచారు. అలాగే షటిల్ టోర్నీలో 9వ తరగతి విద్యార్థినులు హేమశివాని, సాయివైష్ణవి, పదోతరగతి మోహన్‌సాయి, సాయిప్రసాద్ విజేలుగా నిలవగా, 9వ తరగతి విద్యార్థినులు ఫాతిమా, సాయిశ్రీధన్య రన్నర్స్‌గా నిలిచారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ రాజశేఖర్‌నాయుడు ఈ విద్యార్థులను అభినందించారు. డీన్ సతీష్, ఏగో గోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు అనీఫ్, సురేష్, మహేశ్వరి, ఉషారాణి పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

సునీల్‌కుమార్ రెడ్డికి డాక్టరేట్



ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో పరిశోధన చేసిన సునీల్‌కుమార్ రెడ్డికి బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ బి.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 'అనంతపురం జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల నేపథ్యం– వాటి ప్రాధాన్యత ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

'హాస్టల్ సదుపాయాలు కల్పించాలి'

ఎస్కేయూ: క్యాంపస్ కళాశాల విద్యార్థులకు వసతి సౌకర్యం ఇబ్బందికరంగా మారిందని .. నూతన హాస్టల్ అయిన తుంగభద్ర హాస్టల్‌లోని మొదటి అంతస్తును వెంటనే ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్కేయూ ఆర్ట్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీఎన్ కృష్ణా నాయక్‌కు బుధవారం వారు వినతిపత్రం అందచేశారు. ఇంజినీరింగ్ కోర్సు చదివే విద్యార్థులకు 1300 మంది ఉన్నప్పటికీ, ఒక్కో గదిలో 10 మందికి పైగా కేటాయించారని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జాన్సన్‌బాబు, ఎస్కేయూ అధ్యక్షుడు వీరు యాదవ్, సుబ్బరాయుడు, శ్రీధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో నవ సమాజం

జేఎన్‌టీయూ: నూతన ఆవిష్కరణలతో నవ సమాజం సాధ్యమని రైపర్ (రాఘవేంద్ర ఫార్మసీ కళాశాల) ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మనాభ రెడ్డి అన్నారు. 'ఫార్మకో విజిలెన్స్' అనే అంశంపై గత రెండు రోజులుగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమర్పించిన పరిశోధన పత్రాలను ఎంపిక చేసి ఆయన బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ కే.సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఏ కోర్సుపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీమేధావి జూనియర్ కళాశాలలో బుధవారం సీఏ కోర్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసీఏఐ చైర్మన్ డాక్టర్ డి.హరిశ్చంద్రరామ, ట్రెజరర్ ఆర్‌ఐ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం సీఏ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని, మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టి. శ్రీధర్, ప్రిన్సిపల్ డీఏ సిద్దిక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రీ పీహెచ్‌డీ పరీక్ష

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీ పీహెచ్‌డీ రాత పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. భువనవిజయంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రీసెర్చ్ మెథడాలజీ పరీక్షకు మొత్తం 194 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 177 మంది పరీక్షకు హాజరైనట్లు ఎస్కేయూ క్యాంపస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్/ చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీఎన్ కృష్ణానాయక్ తెలిపారు. పరీక్షల తీరుతెన్నులను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జే.శ్రీరాములు పర్యవేక్షించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

అనంతపురం

నీలిమ	– దువ్వాడ జగన్నాథం
త్రివేణి	– వివేకం
తరంగణి	– ఆనందోబ్రహ్మ
తేజస్విని	– ఏ జంటిల్మన్
శాంతి	–నేనే రాజు నేనే మంత్రి
సుధ	– అర్జున్‌రెడ్డి
గౌరి	– ఫిదా
గాయత్రి	– వీఐపీ 2
గంగ	– అర్జున్‌రెడ్డి
గౌతమి	– లై
ఎస్వీ సినీమాక్స్	–జయ జానకీ నాయక



సాక్షి
అనంతపురం | గురువారం | ఆగస్టు | 31 | 2017

Portal Updates:
www.sakshieducation.com
→ Paramedical Diploma Courses at AP Paramedical Board
→ PG Diploma Courses (Distance) 2017-18 at Andhra University
→ 65 Technical Superintendent & Medical Attendant Posts at SSC

విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to..sakshieducation@gmail.com

‘మార్తాండ సూర్యాలయం’ నిర్మాత ఎవరు?



ఎం. వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

మాదిరి ప్రశ్నలు

1. ‘కవిరాజ మార్గం’ను అమోఘవర్షుడు ఏ భాషలో రాశాడు?
1) బెంగాలీ 2) సంస్కృతం
3) కన్నడం 4) మరాఠీ

2. ‘దిల్వారా జైనాలయం’ ఎక్కడ ఉంది?
1) రాజస్థాన్ 2) గుజరాత్
3) బెంగాల్ 4) కర్ణాటక

3. కాలచూరుల (హైహయులు) రాజధాని?
1) కనోజ్ 2) త్రిపురి
3) మౌంట్ అబూ 4) ఢిల్లీ

4. గహద్వాల చంద్రదేవుడు విధించిన ప్రత్యేక పన్ను ఏది?
1) పురిటి సుంకం 2) గణాచారి సుంకం
3) పొయ్యి సుంకం
4) తురుష్క దండన సుంకం

5. కింది వాటిలో చాంద్‌బర్దాయ్ హిందీలో రాసిన గ్రంథం?
1) పృథ్వీరాజ్ రాశో 2) రాజస్థాన్ కథావళి
3) నైషధ చరిత్ర 4) శిశుపాల వధ

6. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయాన్ని ఎవరు నిర్మించారు?
1) సోలంకీలు 2) చౌహాన్‌లు
3) చందేలులు 4) గహద్వాలులు

7. కింది వాటిలో సరైన జత ఏది?
1) విక్రమశిల విశ్వవిద్యాలయం – ధర్మపాలుడు
2) సోమనాథ దేవాలయం – ప్రభాస్ పఠాన్
3) మిహిర భోజుడు – ప్రతీహార వంశం
4) పైవన్నీ సరైనవే

8. మిహిరభోజుని ఆస్థానాన్ని సందర్శించిన అరబ్బు యాత్రికుడు ఎవరు?
1) సులేమాన్ 2) అబ్దుల్ రజాక్
3) ఫిరదౌసి 4) లేన్‌పూల్

9. జతపరచండి.

రాజవంశం	రాజధాని
i) చౌహాన్‌లు	a) అన్హిల్‌వాడ్
ii) పరమారులు	b) ఖజురహో
iii) సోలంకీలు	c) గౌర్
iv) చందేలులు	d) ధారానగరం
v) సేన	e) అజ్మీర్

1) i-a, ii-b, iii-c, iv-d, v-e
2) i-e, ii-d, iii-a, iv-b, v-c
3) i-a, ii-d, iii-c, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

10. పృథ్వీరాజ్ చౌహాన్ వివాహమాడిన గహద్వాల జయచంద్రుడి కుమార్తె ఎవరు?
1) శీలమహాదేవి 2) సంయుక్త
3) మాచల్దేవి 4) పద్మిని

11. మొదటి తరైన్ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
1) క్రీ.శ. 1191 2) క్రీ.శ. 1192
3) క్రీ.శ. 1193 4) క్రీ.శ. 1194

12. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కల్నల్ టాడ్ – రాజస్థాన్ కథావళి
2) షానామా – ఫిరదౌసి
3) జగన్నాథాలయం – భువనేశ్వర్
4) హిందూ జాతీయ వీరుడు – పృథ్వీరాజ్ చౌహాన్

13. చందేవార్ యుద్ధ విజేత ఎవరు?
1) గజనీ మహమ్మద్
2) మహమ్మద్ ఘోరీ
3) పృథ్వీరాజ్ చౌహాన్ 4) జయచంద్రుడు

14. ‘ముంజేశ్వర’ చెరువు ఎక్కడ నిర్మించారు?
1) ధారానగరం 2) ఢిల్లీ
3) అజ్మీర్ 4) జోధ్‌పూర్

15. తమ శీల సంరక్షణకు రాజపుత్ర స్త్రీలు ఆత్మహత్య చేసుకోవడాన్ని ఏమంటారు?
1) జనానా 2) జిజియా
3) జౌహార్ 4) సల్లేఖన

16. ‘సమరాంగణ సూత్రధార’ గ్రంథాన్ని పరమార భోజుడు ఏ అంశాలపై రాశాడు?
1) వాస్తు అంశాలు 2) రాజనీతి అంశాలు
3) యోగా అంశాలు
4) అలంకారశాస్త్ర అంశాలు

17. ‘పంచరత్నాలు’ అనే కవులను పోషించిన వారెవరు?
1) మొదటి భీమరాజు 2) లక్ష్మణసేనుడు
3) విజయసేనుడు 4) జయసింహుడు

18. కింది వాటిలో గాంగయ నరసింహదేవుడు నిర్మించిన నిర్మాణం ఏది?
1) సూర్యాలయం (మొంఢేరా)
2) సూర్యాలయం (అల్మోరా)
3) సూర్యాలయం (కోణార్క్)
4) కైలాసనాథాలయం (ఎల్లోరా)

19. టిబెట్‌లో అతిశదీపాంకరుడు ప్రచారం చేసిన బౌద్ధమత శాఖ ఏది?
1) మహాయానం 2) హీనయానం
3) తాంత్రికయానం 4) వజ్రయానం

20. ‘జ్ఞానమే మోక్షానికి మార్గం’ అని ప్రబోధించిందెవరు?
1) ఆదిశంకరాచార్యులు
2) రామానుజాచార్యులు
3) మధ్వాచార్యులు 4) వల్లభాచార్యులు

21. ‘ప్రతీహారులు’ అంటే..?
1) శిల్పులు 2) వ్యాపారులు
3) నావికులు 4) ద్వార పాలకులు

22. త్రైపాక్షిక పోరాటం రాష్ట్రకూట, పాల, ప్రతిహార రాజ్యాల మధ్య ఏ భూభాగం కోసం జరిగింది?
1) రాయచూర్ 2) కనోజ్
3) ఢిల్లీ 4) నవద్వీపం

23. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కందరీయ మహాదేవాలయం – ఖజురహో
2) గిరిజాదేవి శక్తి పీఠం – కటక్
3) ఉడిపి – కర్ణాటక
4) విఠలాలయం – హంపీ

24. ‘రాజతరంగిణి’ గ్రంథం ఎవరికి సంబంధించింది?
1) కశ్మీర్ రాజులు 2) సేన రాజులు
3) సోలంకీలు 4) పరమారులు

25. ‘భారత చరిత్ర పితామహుడు’ ఎవరు?
1) చాంద్‌బర్దాయ్ 2) జె.ఎన్. సర్కార్
3) కల్హణుడు
4) మామిడిపూడి వెంకటరంగయ్య

26. పృథ్వీరాజ్ చౌహాన్ (మూడో పృథ్వీరాజ్) రాణి సంయుక్తను ఏ విధమైన వివాహం చేసుకున్నాడు?
1) స్వయంవర వివాహం



జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ
ప్రత్యేకం

2) రాక్షస వివాహం 3) బ్రహ్మ వివాహం
4) ప్రజాపత్య వివాహం

27. మహమ్మద్ బిన్ ఖాసీం సైన్యాలను ఎదుర్కొన్న దాహిర్ రాజు భార్య పేరు?
1) రాణీబాయి 2) పరిమళదేవి
3) సూరజ్‌దేవి 4) రాణి పద్మిని

28. అరబ్బులు హిందువులు, బౌద్ధులు ఇతర పౌరులను ఏమని వ్యవహరించారు?
1) జిమ్మీలు 2) త్రైవైపులు
3) కాఫిర్‌లు 4) మ్లేచ్ఛులు

29. గజనీ మహమ్మద్ ధ్వంసం చేసిన శ్రీ చక్రస్వామి ఆలయం ఎక్కడ ఉంది?
1) కనోజ్ 2) మధుర
3) ముల్తాన్ 4) స్థానేశ్వరం

30. సోమనాథ్ దేవాలయాన్ని గజనీ మహమ్మద్ ఎప్పుడు ధ్వంసం చేసాడు?
1) క్రీ.శ. 1020 2) క్రీ.శ. 1022
3) క్రీ.శ. 1023 4) క్రీ.శ. 1025

31. కింది వాటిలో సరైంది ఏది?
1) కితాబ్–ఉల్–యామ్ని గ్రంథం – ఉత్బి
2) కితాబ్–ఉల్–హింద్ గ్రంథం – అల్‌బెరూనీ
3) బహ్మన్‌నామా గ్రంథం – అజారీ
4) పైవన్నీ సరైనవే

32. గజనీ మహమ్మద్ దండయాత్రను తొలిసారి ఎదుర్కొన్న హింద్‌షాహీ రాజు ఎవరు?
1) జయపాలుడు 2) ఆనందపాలుడు
3) త్రిలోచనపాలుడు 4) భీమపాలుడు

33. ఖజురహోలోని దేవాలయాలను ఏ శైలిలో నిర్మించారు?
1) ఇండో–గ్రీక్ 2) ఇండో–ఆర్యన్
3) ద్రావిడ 4) గోథిక్

34. జతపరచండి.

i) జయనకుడు	a) కుమారపాల చరిత్ర
ii) రాజశేఖరుడు	b) మాలతీ మాధవం
iii) హేమచంద్రుడు	c) ప్రబోధ చంద్రోదయం
iv) భవభూతి	d) పృథ్వీరాజ విజయం
v) ఆనందవర్ధనుడు	e) కర్పూర మంజరి

1) i-e, ii-a, iii-d, iv-c, v-b
2) i-c, ii-e, iii-b, iv-a, v-d
3) i-d, ii-e, iii-a, iv-b ,v-c
4) i-b, ii-c, iii-a, iv-e, v-d

35. కశ్మీర్‌లోని ‘మార్తాండ సూర్యాలయం’ నిర్మాత ఎవరు?
1) హరిసింగ్
2) లలితాదిత్య ముక్తాపీడుడు
3) బాలాదిత్య 4) జయపాలుడు

36. ‘శిల నిర్మిత సుందరనగరం’ అని దేన్ని పిలిచేవారు?
1) ఉదయ్‌పూర్ 2) భగత్‌పూర్
3) జైపూర్ 4) జోధ్‌పూర్

37. ‘ఖండన ఖండఖాద్యం’ గ్రంథకర్త ఎవరు?
1) శ్రీహర్షుడు 2) దండి
3) పద్మగుప్తుడు 4) కల్హణుడు

38. ప్రతీహారులు తాము ఎవరి సంతతికి చెందిన వాళ్లమని చెప్పుకొన్నారు?
1) ఇంద్రుడు 2) లక్ష్మణుడు
3) వరుణుడు 4) బ్రహ్మ

39. విద్యాధరుడు అనే రాజు ఏ వంశానికి చెందినవాడు?
1) ఛందేల 2) సోలంకీ
3) పాల 4) పరమార

40. ‘అరబ్బుల సింధూపై దండయాత్ర ఫలితం లేని విజయం’ అని అన్నదెవరు?
1) జె.ఎన్. సర్కార్
2) రాధాకుముద్ ముఖర్జీ
3) లేన్‌పూల్ 4) వి.ఎ. స్మిత్

41. హర్షుడి పాలనాకాలం ఏది?
1) క్రీ.శ. 606 - 647
2) క్రీ.శ. 606 - 656
3) క్రీ.శ. 606 - 666
4) క్రీ.శ. 600 - 647

42. ‘సూర్య శతకం’ రాసిందెవరు?
1) బాణుడు 2) మతంగ దివాకరుడు
3) భర్తృహరి 4) మయూరుడు

43. కింది వాటిలో సరికాని జత?
1) యాత్రికుల్లో యువరాజు – హుయాన్‌త్సాంగ్
2) మహామోక్ష పరిషత్ – స్థానేశ్వరం
3) నలంద విశ్వవిద్యాలయం – రాజ్‌గిర్
4) కాదంబరి గ్రంథం – బాణుడు

44. హర్షుడి తొలి రాజధాని ఏది?
1) కనోజ్ 2) ఉజ్జయిని
3) శ్రీనగర్ 4) స్థానేశ్వరం

45. కింది వాటిలో హుయాన్‌త్సాంగ్ రచన ఏది?
1) నేచురల్ హిస్టరీ 2) ది ట్రావెల్స్
3) సి–యూ–కి 4) ఫో–కో–కి

46. ‘సకలోత్తరాపథేశ్వరుడు’ అనేది ఎవరి బిరుదు?
1) భాస్కర వర్మ 2) రెండో పులకేశి
3) రెండో ధ్రువసేనుడు 4) హర్షుడు

47. హర్షుడి వంశం ఏది?
1) పుష్యభూతి 2) పశ్చిమ చాళుక్య
3) ప్రతీహార 4) గహద్వాల

48. కింది వాటిలో హర్షుడి రచన కానిది ఏది?
1) నాగానందం 2) చండీ శతకం
3) రత్నావళి 4) ప్రియదర్శిక

49. రెండో పులకేశి, హర్షుడి రాజ్యాల సరిహద్దుగా ఉన్న నది ఏది?
1) యమున 2) గోమతి
3) నర్మద 4) కావేరి

50. ‘రాజశ్రీ’ ఎవరు?
1) హర్షుడి తల్లి 2) హర్షుడి కుమార్తె
3) హర్షుడి సోదరి 4) హర్షుడి పినతల్లి

51. కింది వాటిలో సరైన జత ఏది?
1) మహామోక్ష పరిషత్ – ఐదేళ్లకోసారి
2) ప్రభాకర వర్ధనుడు – హూణ హరిణ కేసరి
3) గృహవర్మ – మౌఖరి వంశం
4) పైవన్నీ సరైనవే

52. జతపరచండి.

పదజాలం	అర్థం
i) రాజస్థానీయ	a) కోశాధికారి
ii) మహాబలాధీకృత	b) అమ్మకం పన్ను
iii) భాండాగారాధీకృత	c) పన్ను వసూలు చేసే అధికారి
iv) తుల్యమేయ	d) సేనాపతి
v) ధ్రువాధికరణ	e) విదేశీ వ్యవహారాలు

1) i-e, ii-d, iii-c, iv-b, v-a
2) i-e, ii-b, iii-c, iv-d, v-a
3) i-c, ii-d, iii-a, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

53. సి–యూకి గ్రంథం ప్రకారం, క్రీ.శ. 7వ శతాబ్దంలో భారతీయులు ఏం తినరని పేర్కొన్నారు?
1) ఉల్లి, వెల్లుల్లి
2) మిరపకాయ, కందిపప్పు
3) అల్లం, మెంతులు
4) పెసరపప్పు, మినప పప్పు

54. కనోజ్‌లో జరిగిన సర్వమత మహాసభ అధ్యక్షుడెవరు?
1) భాస్కర వర్మ 2) హుయాన్‌త్సాంగ్
3) తాయిసుంగ్ 4) గౌడశశాంకుడు

55. ‘దానధర్మ క్షేత్రం’ అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
1) కనోజ్ 2) అజ్మీర్
3) ప్రయాగ 4) శ్రీనగర్

56. హర్షుడి తండ్రి ఎవరు?
1) ఆదిత్య వర్ధనుడు 2) రాజ్య వర్ధనుడు
3) ప్రభాకర వర్ధనుడు
4) భాస్కర వర్మ

57. కింది వాటిలో సరైన జత ఏది?
1) యశోమతీదేవి – హర్షుడి తల్లి
2) కామరూప – అస్సాం
3) సోమోద్భవ – నర్మదా నది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4	5) 1
6) 3	7) 4	8) 1	9) 2	10) 2
11) 1	12) 3	13) 2	14) 1	15) 3
16) 1	17) 2	18) 3	19) 4	20) 2
21) 4	22) 2	23) 2	24) 1	25) 3
26) 2	27) 1	28) 1	29) 4	30) 4
31) 4	32) 1	33) 2	34) 3	35) 2
36) 4	37) 1	38) 2	39) 1	40) 3
41) 1	42) 4	43) 2	44) 4	45) 3
46) 4	47) 1	48) 2	49) 3	50) 3
51) 4	52) 4	53) 1	54) 2	55) 3
56) 3	57) 4			



పి. నీలకంఠయ్య
జెడ్‌పీహెచ్ఎస్,
కమ్మకండ్రిగ,
చిత్తూరు జిల్లా.

టెన్త్ బయాలజీ సీసీఈ విధానంలో..

పిల్లల సంపూర్ణ వికాసానికి విద్య తోడ్పడాలనే లక్ష్యంతో రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)ని అమలు చేస్తున్నారు. విద్య ద్వారా పిల్లల్లో మానసిక పరిపక్వతతోపాటు స్నేహం, సహకారం, సహనశీలత, ఓర్పు వంటి వైఖరులు అలవడాలి. వారిలో తార్కిక వివేచన, సృజనాత్మక ఆలోచనలు పెంపొందాలి. సమస్యలకు కుంగిపోకుండా ఎదురునిలిచి వాటిని పరిష్కరించే నేర్పు రావాలి. వీటన్నింటి కోసం సీసీఈని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో కేవలం పిల్లలకు పరీక్షలు పెట్టడం మాత్రమే కాకుండా వారి జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ నైపుణ్యాలను పెంపొందించడం ఉంటుంది. ఈ మూల్యాంకనం రెండు రకాలు. అవి..

1) నిర్మాణాత్మక మూల్యాంకనం - ఫార్మేటివ్ అసెస్‌మెంట్
2) సంగ్రహణాత్మక మూల్యాంకనం - సమ్మేటివ్ అసెస్‌మెంట్

నిర్మాణాత్మక మూల్యాంకనం: ఇది అంతర్గత మూల్యాంకనం. విద్యార్థి సామర్థ్యాలను, సాధన స్థితిగతులను అంచనా వేసేందుకు, అభ్యసనాన్ని మెరుగుపర్చడానికి ఈ మూల్యాంకనం సహాయపడుతుంది. తరగతి గదిలో జరిగే చర్చలు, పిల్లల ప్రతిస్పందనలు, పిల్లలు రాసిన నోటు పుస్తకాలు, తరగతి పని, ఇంటిపని, ప్రాజెక్ట్ పనులు, ప్రయోగశాల కృత్యాలు వంటి అంశాల ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహిస్తారు. ఇందులో నాలుగు రకాల సాధనాలను ఉపయోగిస్తారు.

జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు

1) రాత అంశాలు – 10 మార్కులు
2) ప్రాజెక్ట్ పనులు–10 మార్కులు
3) ప్రయోగశాల పనులు – 10 మార్కులు
4) లఘు పరీక్ష–20 మార్కులు. పై సాధనాల ద్వారా సాధించిన గ్రేడ్‌లను నమోదు చేయాలి.

జీవశాస్త్రంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ నిర్వహణ:

విద్యార్థులు రెండు లాంగ్‌సైజ్ నోట్‌బుక్‌లు తీసుకోవాలి. ఒకదానిలో తరగతి గది రాత పని, మరొకదానిలో ప్రాజెక్ట్ పని, ప్రయోగశాల నివేదిక, లఘు పరీక్షను రాయాలి.

1. రాత పనులు - నోటు పుస్తకాలు: పిల్లలు తాము అవగాహన చేసుకున్న అంశాన్ని సొంత మాటలతో వ్యక్తీకరించడానికి, భావాన్ని లిఖిత రూపంలో తెలియజేయడానికి లేఖనా నైపుణ్యం అవసరమని మనకు తెలుసు. ఇందు కోసం నోటు పుస్తకాలు ఉపయోగపడతాయి. వీటిలో పిల్లలు ప్రశ్నలకు జవాబులను సొంత మాటల్లో రాయాలి. దీనివల్ల పిల్లల్లో భావనల పట్ల స్పష్టత వస్తుంది. రాత పనికి పది మార్కులుంటాయి. ఉపాధ్యాయుడు కింది అంశాల ఆధారంగా మార్కులు కేటాయించాలి.

1) సొంతంగా రాసినదై ఉండటం
2) బొమ్మలు గీసి ఉండటం
3) భాషాదోషాలు లేకుండా ఉండటం.

2. ప్రాజెక్ట్ పని: పాఠ్య పుస్తకంలో ప్రతి పాఠం మధ్యలో కొన్ని ప్రాజెక్టులు ఇచ్చారు. వీటితోపాటు స్థానిక వనరులు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుడు సొంతంగా కొన్ని ప్రాజెక్ట్‌లు తీసుకోవచ్చు.

ప్రతి ఫార్మేటివ్ కాలంలో ఒక ప్రాజెక్ట్‌ను తప్పనిసరిగా చేయాలి. పాఠంలో ఇచ్చిన కృత్యాలు ప్రాజెక్ట్‌లు కావు. ప్రాజెక్ట్‌లో ఒక



సమస్య పరిష్కారం కోసం వేర్వేరు సాధనలు ఉపయోగించి సమాచారాన్ని సేకరించి విశ్లేషించాలి. చివరకు నిర్ధారణకు రావాలి. ప్రాజెక్ట్‌ని వ్యక్తిగత, జట్టు ప్రాజెక్ట్ పనిగా ఇవ్వాలి. ఇంటర్వ్యూ చేయడం, సమాచార సేకరణ, పరిశోధన గ్రంథాలు, రిఫరెన్స్ పుస్తకాలు చదవడం ద్వారా ప్రయోగాలు చేయడం, వస్తువును, నమూనాను తయారు చేయడం కూడా ప్రాజెక్ట్‌లో భాగమే. ప్రాజెక్ట్‌లో రెండు ప్రధానాంశాలుంటాయి. అవి...

1) ప్రాజెక్ట్‌కు సిద్ధం కావడం, నిర్వహించడం.
2) ప్రాజెక్ట్ నివేదిక రాయడం.

కింది అంశాలు ప్రాజెక్ట్ నివేదికలో ఉండాలి.

1) ప్రాజెక్ట్ పేరు/సమస్య/ప్రశ్న
2) లక్ష్యాలు
3) ఎంచుకునే సాధనాలు/అధ్యయనం చేయడం
4) అధ్యయన పద్ధతి
5) విషయ విశ్లేషణ – పట్టికలు
6) ముగింపు 7) ఉపయోగించిన వనరులు
8) కృతజ్ఞతలు

విద్యార్థులు ఉపయోగించిన సాధనాలు, ప్రాజెక్ట్ నిర్వహణ తీరును బట్టి మార్కులు కేటాయిస్తారు. జట్టుగా ప్రాజెక్ట్‌ను నిర్వహించినా వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థి మొత్తం నివేదికను ఫార్మేటివ్ నోట్స్‌లో రాయాలి.

3. విద్యార్థి ప్రతిస్పందనలు, ప్రయోగశాల పనులు/రికార్డ్ నిర్వహణ

విజ్ఞాన శాస్త్రాన్ని నేర్చుకోవడంలో ప్రయోగాల నిర్వహణ ముఖ్యమైంది. విద్యార్థులు ప్రయోగశాలలో చేసిన ప్రయోగ విధానాన్ని, సాధించిన ప్రక్రియ నైపుణ్యాలను మదింపు చేయాలి. ఇందుకోసం పరికరాల అమరికలో వారు ప్రదర్శించే నైపుణ్యం, పరిశీలనల నమోదు, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అదే విధంగా ప్రయోగాలు చేసిన తర్వాత నివేదిక రూపంలో దాన్ని ఫార్మాట్ మూల్యాంకనం నోట్స్‌లో రాయాలి.

ల్యాబ్ రికార్డ్‌లో ఉండాల్సిన అంశాలు..

ఉద్దేశం, కావాల్సిన పరికరాలు, ప్రయోగ విధానం, పరిశీలనలు/ నమోదు, ఫలితాల విశ్లేషణ, సాధారణీకరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రయోగం చేసిన పద్ధతికి 4 మార్కులు, ప్రయోగశాల రికార్డుకు 6 మార్కులు మొత్తంగా పది మార్కులు కేటాయిస్తారు.

4. లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్): పాఠాన్ని బోధించిన తర్వాత విషయావగాహన ఏ మేరకు జరిగిందో ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవడం కోసం పరీక్షను నిర్వహించాలి. నిర్దేశించిన సమయంలో కాకుండా పరీక్ష అనే భావన కలగకుండా ఏ సమయంలోనైనా పరీక్షను నిర్వహిస్తారు. ఇది సాధారణ యూనిట్ పరీక్ష వంటిది కాదు. ఇది 20 మార్కులకు జరుగుతుంది. దీన్ని కూడా ఫార్మేటివ్ నోట్స్‌లోనే రాయాలి. విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు ఈ పరీక్ష నిర్వహిస్తారు.

సంగ్రహణాత్మక మూల్యాంకనం: బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా విద్యార్థి నేర్చుకున్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడమే సంగ్రహణాత్మక మూల్యాంకనం. ఏడాదిలో మూడుసార్లు అంటే SA-I, SA-II, SA-III (పబ్లిక్) పరీక్షలు నిర్వహిస్తారు. నిర్దేశిత విద్యా ప్రమాణాల ఆధారంగా వెయిటేజ్‌ను నిర్ణయించి పరీక్షను నిర్వహిస్తారు.

పై ప్రమాణాల ఆధారంగా దీర్ఘ సమాధాన ప్రశ్నలు, లఘు రూప, స్వల్ప సమాధాన, బహుళైచ్ఛిక రూపంలో ప్రశ్నలు వస్తాయి. భాషేతర అంశాలైన గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రంలో ప్రశ్నల స్వరూపం, సంఖ్య ఇదే విధంగా ఉంటుంది. కేవలం 4 మార్కుల ప్రశ్నలకు అంతర్గత చాయిస్ ఉంటుంది. మిగిలిన ప్రశ్నలన్నింటినీ విద్యార్థి తప్పకుండా రాయాలి. చాయిస్ ఉండదు.

సైన్స్‌లో విద్యా ప్రమాణాల వారీగా వెయిటేజ్

విద్యా ప్రమాణాలు	వెయిటేజీ	మార్కులు
విషయావగాహన	40%	16
ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం	10%	4
ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు	15%	6
సమాచార నైపుణ్యాలు	15%	6
బొమ్మలు గీయడం ద్వారా భావ ప్రసారం	10%	4
నిజ జీవిత వినియోగం, ప్రశంస	10%	4

ప్రశ్న రకం	ప్ర. సం.	మార్కులు	మొత్తం
స్వల్ప సమాధానం	4	4	4×4=16
లఘురూపం	5	2	5×2=10
దీర్ఘ సమాధాన ప్రశ్నలు	4	1	4×1=4
బహుళైచ్ఛికం	20	1/2	20×1/2=10

The validity of the GST registration?



K
Director,
DBS, Hyderabad

M

1 . man maThe BankingrOmbudsDealers
reject a complaint at any stage if it appears to him that a complaint made to him ____:
a) If the Compensation sought from the Banking Ombudsman is beyond Rs. 20 lakh
b) If it requires consideration of elaborate documentary and oral evidence
c) If the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
d) If the complaint is without any sufficient cause
e) All the above


2 . ing set upWhoamong the follow
the Credit Guarantee Fund Trust for Micro and Small Enterprises (CGTMSE)? V
a) GOI
b) Ministry of MSME
c) SIDBI d) a & c
e) Reserve Bank of India

3 . wing canWho among
issue Commercial Paper(CP)?
a) Corporates
b) Primary Dealers
c) All India Financial Institutions
d) a, b, & c e) a & b only

4 . d balanceAs per the Expert Committee b) Agriculture
sheet, If the tangible net worth of the company is not less than ______ crore, then the corporate would be eligible to issue CP.
a) 4 b) 3 c) 2
d) 5 e) None of these

5 . unt nCompensation many bleed lines are there
exceeding Rs. _____ lakh to the complainant for mental agony and harassment may be awarded by Banking Ombudsman.
a) 1 b) 2 c) 3
d) 5 e) None of these

6 . PrioritAs per the Form GSTR -1
Sector guidelines Which of the following categories are there?



c) Social Infrastructure
d) Renewable Energy
e) All of these

7 . 500 wCurrency note of Rs.
have ' five bleed lines on left and right in raised print'. Similarly how many bleed lines are there on the left and right in Rs. 2000 currency note?
a) 3 b) 4 c) 6 d) 7 e) 8

8 . forms arWhich of the following
used for Acknowledgement of registration for GST?
a) Form GSTR -1
b) Form GSTR -2
c) Form GST REG-02
d) Form GST REG
e) None of these

9 . N CARDIf the fourth letter of PA
is 'P' then it denotes _____:
a) Company b) Firm
c) Person d) Trust
e) HUF

10 registra-
tion certificate is:
a) One year b) Two years
c) Five years
d) Valid till it is canceled
e) None of these

11 nsUnion
CIBIL is located in _________ :
a) Chennai b) Kolkatta
c) Mumbai d) Bengaluru
e) None of these

12 a Non-
Banking Finance Company should be Rs.______ to get the NBFC license from RBI.
a) 100 Lakh b) 150 Lakh
c) 200 Lakh d) 250 Lakh
e) None of these

13 ds for:
a) Residential b) Recoverable
c) Resident d) Residual
e) None of these

14 our-year
business plan embarked by the Government of India for providing rural infrastructure in the areas of:
a) Irrigation & water supply
b) Electrification c) Housing
d) Telecommunication & connectivity
e) All the above


15 .
a) National & International Exchange of India
b) National Internet Exchange of India
c) National Inter Exchange Interest
d) None of the above
e) National Industrial Exchange of India

K

1) e	2) d	3) d	4) a
5) a	6) e	7) d	8) c
9) c	10) d	11) c	12) c
13) c	14) e	15) b	16) c

గుర్తించండి

raft
hike
kiwi
branch
sweater
teacher
lolipop
log



b	p	b	i	h	t	h	b	b
r	g	r	k	w	n	i	w	r
e	l	a	z	m	f	k	j	a
h	o	n	a	v	o	e	o	f
c	g	c	p	b	n	u	p	t
a	v	h	j	g	q	z	t	u
e	c	n	z	t	i	w	i	k
t	r	e	t	a	e	w	s	t
i	l	o	l	i	p	o	p	j

పైన ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి

దారి కనుక్కోండి

తన స్నేహితులతో కలిసి వచ్చిన వంకాయ తప్పిపోయింది. తన స్నేహితుల వెళ్లడానికి దారి చూపిస్తారా?



నాన్నా చెప్పవా?

పెంగ్విన్లు సముద్రంలో ఎలా ఉండగలుగుతాయి?




మన భూగోళం మీద, మంచుతో నిండిన అంటార్కిటికా ప్రాంతంలో నివసించే పెంగ్విన్లు అద్భుతమైన డైవర్లనీ, గజఈతగాళ్ళనీ వర్ణించ వచ్చు. ఇవి సముద్రంలో 500 మీటర్ల లోతు దాకా వెళ్లడమే కాకుండా, పైకి రాకుండా సుమారు 15 నిమిషాల దాకా నీటిలోపల ఉండ గల్గుతాయి. ఇందుకు ఒక ముఖ్య కారణమే ఉంది లెండి.

పెంగ్విన్ల శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 38 డిగ్రీల సెల్సియస్ వుంటుంది. అయితే ఇవి సముద్రం లోపలికి దిగాక వాటి ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోతుంది. దాంతో వాటి శరీరం లోపలి కణజాలాలన్నీ తమ తమ జీవన చర్యల వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి అవసరమైన ఆమ్లజని వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి ఆవసరమైన ఆక్సిజన్ కూడా గణనీయంగా తగ్గిపోతుందన్నమాట. ఈ కారణంగా అవి అంతకు ముందు పీల్చుకున్న గాలిలోని ఆక్సిజన్ సాయంతో సుమారు 15 నిమిషాల దాకా నీటి లోపల ఉండగల్గుతాయి.


ఒకవేళ సముద్రం లోపలికి వెళ్ళాక వాటి శరీర ఉష్ణోగ్రత పడిపోయి తద్వారా జీవన చర్యలు మందగించకుండా ఉన్నట్లయితే పెంగ్విన్లు అంతసేపు నీటిలో ఉండటం అసాధ్యమవు తుంది. ఎందుకంటే వాటి శరీరానికి.... పావుగంట సేపు బతికేందుకు కావలసిన ఆక్సిజన్‌ని తమలో నిలుపుకోగలిగే సామర్థ్యం వుండదు.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 8 తేడాలను గుర్తించండి



నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 5 నీడల్లో ఈ జంతువు అసలు నీడ ఏదో గుర్తించండి



కనుక్కోండి



నిజం!


డచ్ దేశస్తులు ఏడాదికి సగటున వెయ్యి కిలోమీటర్లు ప్రయాణిస్తారు




ప్రపంచ దేశాలతో పోల్చినపుడు చైనాలో ఉరిశిక్షలు 4 రెట్లు అధికం



కింద ఇచ్చిన బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి



వినాయక విలాపం

ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో అశేష పూజలందుకున్న ఆదిదేవుడు.. చివరకు ఇలా మిగిలాడు. పెరిగిన పోటీతత్వంతో గల్లీకి రెండు.. మూడు వినాయక మంటపాలను ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి సేకరించిన విరాళాలతో ఆర్భాటాలకు పోయి హంగామా చేశారు. భక్తి పేరుతో పర్యావరణానికి హాని తలపెట్టారు. మట్టి గణపతులను కాకుండా గొప్పలకు పోయిన పలువురు.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, విషపూరిత రసాయనిక రంగులు, ఇనుప చువ్వలు కలిసి తయారు చేసిన ప్రతిమలను కొలువుదీర్చారు. చివరి రోజు ఇలా నిర్లక్ష్యంగా పడేశారు. నీటిలో కరగని వ్యర్థాలతో శింగనమల చెరువు కాస్తా కలుషితమైపోయింది. మట్టి గణపయ్యలను పూజించి.. నిమజ్జనం చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. నీటిలో పడేసిన వినాయకుడి ప్రతిమలను తమ బతుకు తెరువు కోసం కొందరు బుధవారం ఒడ్డుకు లాగారు. వాటిని పగులగొట్టి, అందులో ఉన్న ఇనుప చువ్వలను వెలికి తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఐదు రోజుల పాటు ఎనలేని భక్తి భావం చూపిన చోటే... ఆరో రోజు ఇంతటి నిర్ధయను చవిచూడాల్సి రావడం ఆ విఘ్నాధిపతి చేసుకున్న దౌర్భాగ్యమా? మట్టి ప్రతిమలను పూజలకు వినియోగించడంలో భక్తుల నిర్లక్ష్యమా? ఏదేమైనా.. పర్యావరణం మాత్రం దెబ్బతినింది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు శింగనమల చెరువుకు ఎన్ని రోజులు పడుతుందో..

- జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్









కోచ్‌ల నియామకం



నియామక పత్రాలు అందుకుంటున్న కోచ్‌లు


అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థకు ముగ్గురు కోచ్‌లను నియమించారు. టేబుల్ టెన్నిస్‌కు ధనుంజయరెడ్డి, హాకీకు చంద్ర, జూడోకు రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ బాషామోహిద్దీన్ చేతుల మీదుగా వారు నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా కోచ్‌ల నియామకం జరిగినట్లు వివరించారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి తోడ్పడాలని వారికి సూచించారు.

ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీకి డబుల్‌స్టార్ అక్రిడిటేషన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీకి రెండు స్టార్‌ల అక్రిడిటేషన్‌ను ఏషియన్ ఫుట్‌బాల్ కాన్ఫడిరేషన్(ఐఎఫ్‌సీ) ప్రకటించింది. గతేడాది ఒక స్టార్‌తో ఉన్న అనంత ఫుట్‌బాల్ అకాడమీకి ఈ ఏడాది మరో స్టార్‌ను పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల అండర్–18 విభాగంలో ఆర్డీటీ అకాడమి నుంచి క్రీడాకారులను ఐ లీగ్ పోటీలకు పంపే అవకాశం దక్కిందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు మాంఛోఫెర్రర్, నాగరాజు తెలిపారు. ఈ అరుదైన పురస్కారం ద్వారా జిల్లాలో ఫుట్‌బాల్ మరింత అభివృద్ధి చెందుతున్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

టీబీ డ్యాం నీటి మట్టం

ప్రస్తుతం	
నీటిమట్టం	: 1621.95 అడుగులు
ఇన్‌ఫ్లో	: 23438 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	: 700 క్యూసెక్కులు
నీటి నిల్వ	: 63.670 టీఎంసీలు
గత ఏడాది	
నీటిమట్టం	: 1617.55 అడుగులు
ఇన్‌ఫ్లో	: 7170 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	: 10343 క్యూసెక్కులు
నీటి నిల్వ	: 51.850 టీఎంసీలు



విజయమే లక్ష్యం కావాలి

ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్



ఎంపికైన జిల్లా జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: విజయమే సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని క్రీడాకారులకు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ సూచించారు. సబ్–జూనియర్ అంతర్ జిల్లాల జూడో క్రీడా పోటీలకు ఎంపికైన బాల, బాలికలకు బుధవారం అనంత క్రీడా గ్రామంలో క్రీడా దుస్తులను ఆయన పంపిణీ చేసి, మాట్లాడారు. క్రీడల్లో పిల్లలు రాణించాలంటే తల్లిదండ్రులు ప్రోత్సాహం కూడా చాలా అవసరమని అన్నారు. క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని అన్నారు. జూడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఎన్.బాబు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సబ్–జూనియర్ అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులకు ఆర్డీటీ సంస్థ సహకారంతో పది రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెంటర్ మేనేజర్ సురేంద్ర, యోగా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్ మురళీకాంత్ పాల్గొన్నారు.

ఏడీఎస్‌ఎస్‌ఏఏ జిల్లా కార్యదర్శిగా సత్యనారాయణ



అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సెకెండరీ స్కూల్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యదర్శిగా సత్యనారాయణ నియమితులయ్యారు. బుధవారం స్థానిక రెవెన్యూ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన నియామకాన్ని డీఈఓ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో త్వరలో నిర్వహించాల్సిన జోన్‌స్థాయి క్రీడా పోటీలను పకడ్బందీగా చేపడతామన్నారు. వేదికలను త్వరలో ప్రకటించనున్నట్లు చెప్పారు.

జిల్లాకు రాష్ట్ర స్థాయి టీటీ ఛాంపియన్‌షిప్



విజేతగా నిలిచిన హాసిని



కృష్ణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన హాసిని, కృష్ణ విజేతలుగా నిలిచారు. ఈ నెల 29 నుంచి రెండ్రోజుల పాటు విజయవాడలో జరిగిన 11వ ఈవన్ స్పోర్ట్స్ ఇంటర్ స్కూల్స్ స్టేట్ లెవల్ ఛాంపియన్ షిప్‌లో జిల్లా నుంచి వీరు ప్రాతినిధ్యం వహించారు. జూనియర్ బాలికల సింగిల్స్ విభాగంలో హాసిని 13–11, 11–5, 11–5 సెట్లతో విజేతగా నిలిచింది. జూనియర్ బాలుర సింగిల్స్ విభాగంలో కృష్ణ 11–6, 8–11, 11–4, 11–7తో విజయం కేతనం ఎగురవేసి, బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు.

అభాగ్యులకు అమ్మ



అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

మౌనం అంటే ప్రార్థన
ప్రార్థనంటే ఓ నమ్మకం
నమ్మకమంటే ప్రేమ
ప్రేమంటే ఓ సేవ
సేవలోనే సంతృప్తి

విశ్వమాత మదర్‌థెరీసా నమ్మిన సిద్ధాంతమిది.. ఆమె అడుగుజాడల్లో పయనిస్తున్నాడో యువకుడు. అనాథలకు 'అమ్మ'లా.. అన్నార్థులకు 'అన్న'లా.. కన్నవారి సంరక్షణకు నోచుకోని వృద్ధులకు 'కొడుకు'లా ఉంటూ సేవాపథంలో పయనిస్తున్నారు. అందరూ గొప్ప పనులు చేయలేదు.. కానీ చిన్న పనులైనా 'ప్రేమ'తో చేయవచ్చని నిరూపిస్తున్నాడు. - అనంతపురం మెడికల్

శింగనమల మండలం తరిమెలకు చెందిన రమణారెడ్డి 1997లో డిగ్రీ చదివే రోజుల్లోనే స్నేహితుల సహకారంతో 'అమ్మ' స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. అప్పట్లో మెదడు వాపు వ్యాధితో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు నిరంతరాయంగా పౌష్టికాహారం అందజేశారు. ఇదే సమయంలో రక్తం అందక ఎంతో మంది మృత్యువాత పడుతున్న ఘటనలు ఆయన మనసును కలచివేశాయి. 'రక్తదానం..మహాదానం' నినాదంతో పెద్ద ఎత్తున రక్తదాన ఉద్యమాన్ని చేపట్టారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మందికి తోడుగా నిలిచారు. అలాగే నా అన్న వారు లేక 'అనాథ'లుగా బతుకీడుస్తున్న వారికి చేయూతనందించారు. మృత్యువాత పడితే అంత్యక్రియల సేవ ప్రారంభించారు. సంపాదిస్తున్న మొత్తంలో కొంత పక్కకు తీసి దాతలు, స్నేహితుల సహకారంతో ఎంతో మందికి అండగా నిలుస్తున్నారు. ఇప్పటికీ నగరంలోని కొన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని కొనసాగిస్తున్నారు. అనాథ ఆశ్రమ విద్యార్థులకు కావాల్సిన వైద్య సదుపాయాలు అందజేస్తున్నారు. అనంతలోని 'ఆదరణ మానసిక వికలాంగుల ఆశ్రమం'లో అమ్మ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వేసవిలో రక్షిత మంచి నీటి సదుపాయం ఏర్పాటు చేశారు. 12 ఏళ్లుగా వందలాది మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు. నగరంలోని వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు ఇవ్వడంతో పాటు మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఏటా మదర్ థెరీసా జయంతి పురస్కరించుకుని పేద విద్యార్థులకు, వృద్ధులకు, మానసిక వికలాంగులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. 'అమ్మ' సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో అధికారులు, ప్రముఖులను భాగస్వాముల్ని చేస్తున్నారు. ఈ క్రమంలో వారు సైతం పేదలకు చేయూతనిస్తున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీటీ డైరెక్టర్ మాంఛోఫెర్రర్, జేఎన్‌టీయూ మాజీ రిజిస్ట్రార్ హేమచంద్రారెడ్డి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది శైలజ, ఇక్కడ ఎస్పీగా పని చేసిన రాజశేఖర్‌బాబు.. ఇలా ఎంతో మంది ప్రముఖులు 'అమ్మ'కు తోడుగా నిలుస్తున్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాంఛోఫెర్రర్



అడ్వాన్స్ ఫౌండేషన్ కోర్సు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

'సాక్షి' కథనానికి స్పందనగా

అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామానికి చెందిన గోపీనాథ్ గౌహతిలో బీటెక్ చదువుతుండేవాడు. మెదడు సంబంధిత వ్యాధితో బాధపడ్డాడు. రూ.లక్షలు ఖర్చు చేసినా నయం కాలేదు. ఇదే సమయంలో 'తల్లిడిల్లితున్న తపన' శీర్షికతో సాక్షి కథనం ప్రచురించింది. స్పందించిన రమణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. యువకుడు ఆహారం తీసుకునేందుకు సైతం ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో న్యూట్రీషియన్ పౌడర్, ఆర్థికసాయం చేసి మానవీయతను చాటుకున్నారు. భవిష్యత్‌లో కూడా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

సేవలోనే సంతృప్తి



ఎదుటికి మనిషికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంది. అదే నాకు సంతృప్తి. 20 ఏళ్లుగా నిర్విఘ్నంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నా. స్నేహితులు, కొందరు అధికారులు భుజం తట్టి ప్రోత్సహిస్తున్నారు. చివరి శ్వాస వరకు సేవా కార్యక్రమాలు చేపడతా.
– రమణారెడ్డి, అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు

ఇద్దరు మానసిక వికలాంగుల దత్తత

అనంతపురంలోని అనంత సాగర్ కాలనీకి చెందిన జయమ్మ భర్తను కోల్పోయింది. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో రాజ్యలక్ష్మి, రాజశేఖర్ మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. 'ఆదరణ' మానసిక వికలాంగులు, చెవిటి పిల్లల పాఠశాలలో చదువుతున్నారు. కుటుంబం గడవడమే కష్టంగా ఉన్న తరుణంలో రమణారెడ్డి స్పందించి ఇద్దరినీ దత్తత తీసుకున్నారు.

జీవన సమరం

భర్త మరణం...భవిష్యత్ శూన్యం

- ఏడేళ్లుగా మొండిగోడల కిందే జీవనం
- పింఛన్ అందదు..రేషన్ కార్డు మంజూరు కాదు
- కుమారుడి భవిత కోసం ఓ తల్లి ఆరాటం



పార్వతి, ఆమె కుమారుడు ఉంటున్న స్థలం

కొడుక్కి అన్నం తినిపిస్తున్న పార్వతి

కట్టుకున్న వాడు అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. ఆదుకోవాల్సిన బంధువులు మొహం చాటేశారు. అయినా ఒక్కగానొక్క కొడుకును బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనే ధ్యేయంతో ఓ ఒంటరి మహిళ జీవనం పోరాటం చేస్తోంది. మొండిగోడల మధ్యే నివాసం ఉంటూ మొక్కవోని ధైర్యంతో ముందుకుసాగుతోంది.
– ముదిగుబ్బ

మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన సి. పార్వతి, రాము దంపతులు. వీరికి రాజేష్ సంతానం. అనంతపురంలో కాపురం పెట్టిన రాము...ఆటో నడుపుతూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించేవాడు. అయితే రాము అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి పార్వతికి కష్టాలు మొదలయ్యాయి. బంధువుల ఆదరణ నోచుకోక...కొడుకును సాకలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అయినా తన కొడుకును బాగా చదివించాలని భావించి మకాంను స్వగ్రామైన నక్కలపల్లికి మార్చింది. అక్కడ కూడా ఆశ్రయం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో...బంధువులకు చెందిన మొండిగోడల ఇంటిని నివాసంగా మార్చుకుంది. కూలిపనులు చేసుకుంటూ కుమారుడిని ఏడో తరగతి చదివిస్తోంది.

పట్టించుకోని సర్కార్

వింతంతువైన పార్వతికి అర్హత ఉన్నప్పటికీ అధికారులు ఆమెకు రేషన్ కార్డు మంజూరు చేయలేదు. దీంతో ఇటు పింఛన్, అటు ఇల్లు మంజూరు కాక పార్వతి తల్లడిల్లిపోతోంది. ఏడేళ్లు కనిపించిన అధికారినంతా వేడుకుంటోంది. తనపై దయ ఉంచి పింఛన్, రేషన్‌కార్డు మంజూరు చేయాలని వేడుకుంటోంది.

సైనికుడు



దేశ రక్షణలో మేముసైతం

- రైతు బిడ్డలు...సైన్యంలో జవానులు
- ఆర్మీ వైపు మొగ్గుచూపుతున్న ఆత్మకూరు యువత



మంచుకొండల్లో జాతీయ జెండాతో మన జవాన్లు

"జననీ జన్మభూమిశ్చ...స్వర్గాదపీ గరీయసి... ఏ తల్లి నిను కన్నదో...ఆ తల్లినే కన్న భూమి భారతి గొప్పదిరా"...అంటూ ఓ సినీకవి మాతృభూమి గురించి రాసిన మాటలు ఆ యువకుల మనసుల్లో నాటుకుపోయాయి. అందుకే ఉన్న ఊరిని కన్న తల్లిదండ్రులను వీడి...దేశసేవలో సరిహద్దులో సమరానికి సిద్ధమయ్యారు. ఒకరిని చూసి మరొకరు...ఒకరి వెంట మరొకరు ఇలా...ఆత్మకూరు యువత దేశ సేవలో తరిస్తుండగా...వారిని కన్నవాళ్లంతా గర్వంతో పొంగిపోతున్నారు.
- ఆత్మకూరు

దేశ రక్షణ వ్యవస్థలో భారత సైనిక దళం (ఇండియన్ ఆర్మీ) ఒకటి. ఈ విభాగం ప్రధాన కర్తవ్యం... భూ భాగాన్ని పరిరక్షించడంతో పాటు దేశంలో శాంతి భద్రతలను కాపాడుతూ దేశ సరిహద్దుల భద్రతను పర్యవేక్షించడం. ఇలా దేశ రక్షణలో పాలుపంచుకునేందుకు ఆత్మకూరు మండలానికి చెందిన పలువురు యువకులు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తుండడంతో మండలంలో సైనికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే 150 మందికి పైగా యువకులు ఆర్మీలో సేవలందిస్తున్నరు. కన్న వారి కలలను సహకారం చేస్తూ...దేశ రక్షణలో మేముసైతం అంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కష్టమైనా...ఇష్టపడి..

భారత సైనిక దళాల్లో పనిచేయడం అంత సులువైన విషయం కాదు. కఠోర శిక్షణ...ప్రతికూల పరిస్థితుల్లో విధుల నిర్వహణ..ఇలా ప్రతిదీ కష్టంతో కూడుకున్నదే. సరిహద్దులో కాపాలా ఉండే సైనికులకు పగలు..రాత్రి తేడా ఉండదు..నిరంతరం నిఘా ఉంచాల్సిందే. కొండలు..మంచు పర్వతాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. రక్తం గడ్డకట్టే మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతల్లోనూ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలి. అయినప్పటికీ యువత ఇష్టపడి మరీ దేశ రక్షణలో పాలుపంచుకుంటున్నారు. ఒక్కోసారి కుటుంబీకులతో మాట్లాడటం కూడా నెలల తరబడి కుదరదు. ఇక వివాహితులైతే కుటుంబాన్ని వదిలి విధులకు వెళ్లాల్సిన పరిస్థితులుంటాయి. అయినప్పటికీ దేశ రక్షణ కోసం ప్రాణాలైనా అర్పిస్తామంటూ ముక్తకంఠంతో చెబుతున్నారు.

ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు

సైనికుడి ప్రాణం..గాల్లో దీపంలాంటింది...ఎప్పుడు యుద్ధం వస్తుందో...ఎక్కడ ప్రమాదం పొంచి ఉంటుందో తెలియదు. నిత్యం ప్రాణాలతో చెలగాలం. అందుకే తమ బిడ్డలను ఆర్మీలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రారు. కానీ ఆత్మకూరు మండలలలోని చాలా మంది తల్లిదండ్రులు దేశ భద్రత కోసం తమ బిడ్డలను పునాదిరాళ్లుగా మలుస్తున్నారు. ఆర్మీలో ఉద్యోగం కోసం శిక్షణ కేంద్రాల్లో చేర్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

గర్వంగా ఉంది

ఇండియన్ ఆర్మీలో పని చేయడం గర్వంగా ఉంది. మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కష్టపడి చదివించారు. వారి కష్టాన్ని చూసి పట్టుదలతో శ్రమించి ఉద్యోగం సంపాదించా. సైనికుడిగా మంచిపేరు తెచ్చుకుని నా తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడటానికి ఎంత కష్టమైనా భరిస్తా. - మనోజ్ ప్రభాకర్‌రెడ్డి



నా జీవితం దేశరక్షణకే

నాకు 19 సంవత్సరాల వయసులోనే ఆర్మీలో ఉద్యోగం వచ్చింది . బెంగళూర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నా. దేశ రక్షణ కోసం జీవితాంతం పని చేయడానికి సిద్ధం. పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడమే నాధ్యేయం . - కార్తిక్



దేశరక్షణకు ప్రాణాలైనా అర్పిస్తా

నాకు సైన్యంలో ఉద్యోగం వచ్చి నాలుగు సంవత్సరాలవుతోంది. విధి నిర్వహణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో పనిచేశాను. ప్రస్తుతం ఢిల్లీలో విధులు నిర్వర్తిస్తున్నాను. ఆర్మీలో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. దేశ రక్షణకు ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధం -కొండారెడ్డి



తల్లిదండ్రులతో సెల్ఫీ తీసుకుంటున్న సైనికుడి పేరు మనోజ్ ప్రభాకర్ రెడ్డి. గుజరాత్‌లోని భూజ్ అనే జిల్లాలో పని చేస్తున్నాడు. ఆరు నెలలకోసారి సొంతూరు ఆత్మకూరుకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులకు, స్నేహితులకు బహుమతులు తీసుకువస్తుంటాడు. వాటిని చూసి వారంతా ఎంతో ఆనంద పడుతుంటారు. ప్రస్తుతం వినాయకచవితి పండుగకు వచ్చి కుటుంబ సభ్యులతో ఇలా ఆనందంగా గడుపుతున్నాడు. ఎప్పుడైనా ఇక్కడి వారు గుర్తుకువస్తే స్నేహితులు, బంధువులతో గడిపిన రోజులను గుర్తు చేసుకుంటానని చెబుతున్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పార్వతి. ఆత్మకూరులో హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈమె తనయుడు చంద్ర ఆర్మీలో ఉంటూ లక్నోలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమారుడు గుర్తుకు వచ్చినప్పుడల్లా ఫోన్ చేసి మాట్లాడుతుంది. ఒక్కోసారి ఫోన్‌లో అందుబాటులో రాకపోతే... కుమారుడే మళ్లీ ఫోన్ చేసే దాకా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తుంటుంది. ఒక్కసారి కుమారుడి గొంతు వింటే ఆందోళనంతా మాయమై పోతుందని చెబుతుంది. అక్కడ వాడు ఎంత కష్టపడుతున్నాడోనన్న ఆందోళన ఉన్నా...దేశ సేవకు మా కుటుంబం నుంచీ ఒకరిని పంపామన్న సంతృప్తి నిస్తోందని చెబుతోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు లక్ష్మీదేవి. కుమారుడు భాస్కర్ సైన్యంలో ఉంటూ ప్రస్తుతం బీహార్‌లో భాద్యతలు నిర్వహిస్తున్నాడు. పండుగలు...శుభకార్యాల్లో తమ కుమారుడు తమతో పాటు ఉండకపోవడం బాధగా ఉన్నా....దేశ సేవలో తరిస్తున్నాడని గర్వంగా ఉందని గొప్పగా చెబుతుంది లక్ష్మీదేవి. గుర్తుకు వస్తే మాత్రం ఫోన్ చేసి మాట్లాడుతుంటాను అంటూ ఆనందంగా చెబుతోంది.

